ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 12, సెప్టెంబరు 2024

సాగు జోరు

- వ్యవసాయ పనులు ముమ్మరం
- ఉపకరించిన ఇటీవల వర్షాలు
- పశ్చిమాన మిర్చి, పొగాకు నాట్లు ప్రారంభం
- నీటి వనరుల కింద వరి నారుమళ్లు
- కళకళలాడుతున్న మెట్ట పైర్లు


ఇటీవల కురిసిన వర్షానికి మార్కాపురం మండలం చింతగుంట్ల వద్ద కళకళలాడుతున్న పత్తిపైరు


మార్కాపురం మండలంలో 5వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షం పత్తి పైరుకు ప్రాణం పోసింది. ఏ గ్రామంలో చూసినా కళకళలాడుతోంది. వర్షానికి మండలంలోని కోలభీమునిపాడు, పెద్దనాగులవరం, తిప్పాయపాలెంతోపాటు మరికొన్ని గ్రామాల చెరువులకు నీరు చేరింది. వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి.


కొండపి వద్ద ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

కొండపి నియోజకవర్గంలో వారం క్రితం తేలికపాటి వర్షాలు కురిశాయి. దీంతో రైతులు పొగాకు, శనగ పైర్ల సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం దుక్కులు దున్నుకుంటున్నారు. కాగా తొలకరి వర్షాలకు సాగు చేసిన నువ్వు పంటను కొందరు రైతులు దున్నేయగా, మరికొందరు ప్రస్తుతం కోసి కుప్పలు పెడుతున్నారు. ఎండిన వాటిని విత్తనాలు రాల్చుకుంటున్నారు.

త్రిపురాంతకం మండలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు




పొదిలి సమీపంలో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, పొగాకు, కందితోపాటు కూరగాయల పైర్లు ప్రాణం పోసుకున్నాయి. ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. గత నెలాఖరు వరకూ వర్షాభావంతో కొట్టుమిట్టాడిన రైతన్నలు ఊపిరిపీల్చుకున్నారు. పశ్చిమ ప్రాంతంలో అధికంగా పత్తి పంట వేయగా ప్రస్తుతం అది ఏపుమీద ఉంది. తూర్పుప్రాంతంలో శనగ, పొగాకు సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గుండ్లకమ్మతోపాటు చిన్నచిన్న వాగులు, వంకల్లో నీళ్లు పారాయి. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులకు నీరు రావడంతో భూగర్భ జలాలు పెరిగాయి. రైతన్నలు పైర్లలో కలుపు తీయించుకోవడం, బలం మందు పెట్టుకోవడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.


దర్శి వద్ద ఏపుగా పెరిగిన సజ్జ పైరు

ఒంగోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి)/మార్కాపురం రూరల్/కొండపి : జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలు అందుకు ఉపకరించాయి. అప్పటికే వేసి ఉన్న మెట్ట పైర్లు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. కొత్తగా పంటల సాగు జోరందుకుంది. గడిచిన వారం రోజుల్లోనే దాదాపు 27వేల హెక్టార్లలో అదనంగా పంటలు సాగయ్యాయి. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి, పొగాకు నాట్లు ఊపందుకొన్నాయి. నీటి వనరుల కింద అక్కడక్కడా వరినాట్లు వేస్తున్నారు. అలాగే వరి నారుమళ్లను సిద్ధం చేయడంతోపాటు ఇతర మెట్ట పైర్ల సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. ఇలా పొలం పనుల్లో అందరూ బిజీ అయ్యారు.

రెండు రోజుల్లో 95 మి.మీ సగటు వర్షపాతం

పంటల సాగుపై రైతుల్లో ఆశలు మోడువారుతున్న సమయంలో ఈనెల ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఇంచుమించు 95మి.మీ. సగటు వర్షపాతం జిల్లాలో నమోదైంది. తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్న పశ్చిమప్రాంతంలో భారీ వర్షాలే కురిశాయి. వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది. మరోవైపు సాగుకు సాగర్ నీరు విడుదలైంది. ఈ పరిణామాలు రైతుల్లో మళ్లీ ఆశలను చిగురింపజేశాయి. దీంతో పొలం పనులకు ఉపక్రమించారు. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఎర్రనేలల్లో పొగాకు నాట్లు ప్రారంభమయ్యాయి. సాగర్ ఆయకట్టులో వరిసాగుకు నార్లు పోస్తుండగా బోర్ల నీరు అవకాశం ఉన్న ప్రాంతంలో వరినాట్లు కూడా వేస్తున్నారు. అలా గత వారం రోజుల్లో సుమారు 27వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

ఇటీవల వరకు వర్షాభావం..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందుకు సాగలేదు. అవసరమైన స్థాయిలో వర్షం లేక ఈ పరిస్థితి ఏర్పడింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్ కాగా ఆ సమయంలో జిల్లాలో 2.02 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తారు. అందులో అత్యధికంగా 73వేల హెక్టార్‌లలో కంది, 31,562 హెక్టార్లలో పత్తి ఉంటుంది. మిగిలిన వాటిలో సజ్జ, నువ్వు, మిర్చి, వరి ప్రధానమైవి. కాగా ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పంటల సాగు ముందుకు కదలలేదు. ఆగస్టు ఆఖరు నాటికి సాధారణంగా సుమారు 1.50లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది కేవలం 62,530 హెక్టార్లలో (31శాతం) మాత్రమే వేశారు. ఇక ఈ ఏడాది ఖరీఫ్‌కు కరువు కాటు తప్పదన్న ఆందోళన రైతుల్లో కనిపించింది. ఈ సమయంలో వర్షం కురిసింది.

89,706 హెక్టార్లలో పంటల సాగు

ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ సుమారు 89,706 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు సమాచారం. ఇంకా మెట్ట పైర్లు వేసేందుకు వీలుగా పలుప్రాంతాల్లో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. తాజా వర్షాలు పొలంలో ఉన్న పైర్లకు బాగా మేలు చేశాయి. ప్రధానంగా వాడుముఖం పట్టిన సజ్జ, కంది, పత్తి, మొక్కజొన్న ఇతరత్రా పైర్లు జీవంపోసుకొని కళకళలాడుతున్నాయి. రానున్న వారంపది రోజుల్లో మరింత విస్తారంగా పంటలు సాగు జరగనుంది.


దోర్నాల ప్రాంతంలో మిర్చినాట్లు వేస్తున్న కూలీలు

చచ్చినా చావే!

- రావిపాడులో శ్మశానానికి వెళ్లాలంటే గుండ్లకమ్మ దాటాల్సిందే
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోని పాలకులు


గుండ్లకమ్మ వాగు నుంచి శవాన్ని మోసుకుని శ్మశానానికి వెళ్తున్న రావిపాడు గ్రామస్థులు

కంభం, సెప్టెంబరు 11 : వృద్ధాప్యంతోనో, మరే ఇతర కారణాలతో కాలం చేస్తే ఆ గ్రామస్థులు శ్మశానానికి మృతదేహాన్ని మోసుకెళ్లాలంటే బతికినోళ్ల చావుకు వస్తుందని ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావిపాడు గ్రామానికి కిలోమీటరు అవతల ఊరికి దూరంగా శ్మశానం ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్యలో గుండ్లకమ్మ వాగు ఉంది. ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లాలంటే వేసవి, శీతాకాలంలో ఎలాంటి సమస్య ఉండదు. వర్షాకాలంలో మాత్రం గుండ్లకమ్మ వాగు నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. వాగుపారే సమయంలో ఎవరైనా మరణిస్తే శ్మశానానికి వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. నడుముల పైకి పారుతున్న గుండ్లకమ్మ వాగులోకి దిగి భుజంపై పాడెను మోస్తూ జాగ్రత్తగా తీసుకెళ్లాల్సి వస్తోంది. చివరి చూపు చూసేందుకు బంధువులు, మహిళలు, పిల్లలు వాగు దాటలేని పరిస్థితి. వాగు అవతల ఒక్క శ్మశానమేకాక రైతుల పొలాలు కూడా ఉన్నాయి. వాగు ఉధృతంగా పారే సమయంలో పొలాలకు వెళ్లలేని పరిస్థితి. సమస్యను గత వైసీపీ పాలనలో నాయకులు, అధికారుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి వాగుపై చప్టాను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భార్యకు బదులు భర్త వైద్యం

- జీజీహెచ్‌లో విచిత్రం


భార్య బదులు డ్యూటీ చేస్తున్న డాక్టర్ బాషా

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 11: ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్యం విడ్డూరంగా మారింది. విధుల్లో ఉండాల్సిన మహిళా డాక్టర్ స్థానంలో ఆమె భర్త విధులు నిర్వర్తిస్తున్నారు. పైపెచ్చు వైద్యం కోసం వచ్చిన వారి పట్ల శ్రద్ధ చూపకపోగా, కఠినంగా వ్యవహరించడంపై రోగులు మండిపడుతున్నారు. దీనిపై బుధవారం ప్రజాసంఘాల నాయకులు సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవికి ఫిర్యాదు చేశారు. రిమ్స్ క్యాజువాలిటీలో మధ్యాహ్నం డ్యూటీ చేయాల్సిన డాక్టర్ నజ్మా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తుండగా, ఆమె భర్త డాక్టర్ బాషా విధులు నిర్వర్తిస్తున్నారని దుర్గాదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మహిళా డాక్టర్ నజ్మా డ్యూటీని ఆమె భర్త బాషా చేస్తున్న విషయాన్ని గుర్తించానని, ఈ విషయమై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

వైసీపీ ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- దేవుడి ఉత్సవాన్ని అడ్డుకున్న వైసీపీ నేత
- కేసు విచారణకు పిలిచిన పోలీసులు
- అతనికి మద్దతుగా స్టేషన్‌కి వెళ్లిన తాటిపర్తి
- నిలదీసిన ఆ నాయకుడి బాధితులు


పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న బాధితులు

పుల్లలచెరువు, సెప్టెంబరు 11: ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు పోలీసు స్టేషన్‌లో చేదు అనుభవం ఎదురైంది. మండలంలోని సిద్దెనపాలెంలో మంగళవారం రాత్రి బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ మద్దతుదారులు తమ కులదైవం ఊరేగింపు చేస్తున్నారు. అదే సమయంలో తమ బజారుకు రావొద్దని గడ్డం సుబ్బయ్య అనే వైసీపీ నాయకుడు ఆయన వర్గంతో కలిసి అడ్డుకుని ఇష్టారీతిన దాడి చేశాడు. బాధితుల సమాచారం మేరకు ఎస్‌ఐ బాబూరావు గ్రామానికి వెళ్లి గొడవను అడ్డుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. వైసీపీ నాయకుల దాడిపై బుధవారం ఉదయం టీడీపీ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కోసం సుబ్బయ్యను స్టేషన్‌కు పిలిచారు. విషయం తెలుసుకున్న ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పుల్లలచెరువు స్టేషన్‌కు వచ్చి తమ పార్టీ నాయకుడికి మద్దతుగా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు అక్రమమని నినదించారు. అక్కడే ఉన్న సిద్దెనపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు ఎమ్మెల్యేను నిలదీశారు. గత ఐదేళ్లుగా గడ్డం సుబ్బయ్య చేసిన అక్రమాలను మహిళలు వీడియోల ఆధారాలతో చూపించారు. గ్రామంలో సుబ్బయ్య చేసిన అకృత్యాలను ఒక్కొక్కటిగా ఆయనకు వివరించారు. గ్రామాన్ని తాకట్టు పెట్టి ముటుకుల సొసైటీలో రుణం తీసుకున్నట్లు ఆరోపించారు. గ్రామానికి చెందిన ఓసీ కుటుంబాలను రూ.10లక్షల ఇస్తేనే ఉండండి, లేదంటే ఊరు విడిచి వెళ్లమని కొట్టినా అప్పటి పోలీసులు పట్టించుకోకుండా సుబ్బయ్యకే మద్దతు పలికారని మండిపడ్డారు. టీడీపీ మద్దతుదారుల బోర్లను విరగ్గొట్టి లోపల పడేశాడని, ఆయన అక్రమాలు అన్నీ వినాలని మహిళలు వరుసపెట్టి చెబుతుండగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ కంగుతిని ఏమి మాట్లాడాలో తెలియక అక్కడి నుంచి తిన్నగా జారుకున్నారు.

భారీగా బియ్యం పట్టివేత

- రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి
- 600 బస్తాలు స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

సంతనూతలపాడు, సెప్టెంబరు 11: రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 600 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన ఘటన బుధవారం సంతనూతలపాడులో జరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్‌కు సమాచారం అందింది. దీంతో బుధవారం ఉదయం సంతనూతలపాడులో నాగరాజ ట్రేడర్స్ రైస్‌మిల్లుపై అధికారులు దాడులు చేశారు. బియ్యాన్ని మూడు మినీలారీల్లో తరలించేందుకు మిల్లు ఆవరణలో సిద్ధంగా ఉంచగా తనిఖీ చేశారు. అవి రేషన్ బియ్యమని నిర్ధారించారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని ఒంగోలు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించామని, సీజ్ చేసిన మూడు మినీలారీలను ఎస్‌ఎన్‌పాడు ఎస్సై ఎం.దేవకుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు. రైస్‌మిల్లు యజమాని, సూపర్ వైజర్, డ్రైవర్లపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి వారిని కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు. ఈ దాడిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీటీవో రామారావు, ఎస్సై నాగేశ్వరరావు, తహసీల్దార్ వీఎస్.పాల్, ఎఫ్ఐ గుణవంశీ పాల్గొన్నారు.


సీజ్‌చేసిన వాహనం, నిందితులతో విజిలెన్స్ సిబ్బంది


గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గోతులు

గ్రావెల్ తరలిపోతోంది!

- కనిగిరి పెద్దచెరువును గుల్ల చేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

లోపలి పేజీల్లో..

వైసీపీ నేత దగా

- వ్యవసాయ పరికరాల పేరిట దాదాపు రూ.4 కోట్లు వసూలు
- ఏడాది నుంచి పూర్తిగా ఇవ్వని వైనం
- తాళ్లూరు, ముండ్లమూరు మండలాల రైతుల గగ్గోలు
- ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు
- విచారణ చేపట్టిన ముండ్లమూరు ఎస్సై

దర్శి, సెప్టెంబరు 11 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు కొంతమంది ప్రజలను ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రూపాల్లో దగా చేసి కోట్లాది రూపాయలు జేబులో వేసుకున్న ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి అవినీతి, అక్రమాలను మోసపోయిన వారు ధైర్యంగా బయటకొచ్చి చెబుతున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.. తాళ్లూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు నాగార్జునరెడ్డి ఐటీసీ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొందరు రైతులకు ఐటీసీ ద్వారా సబ్సిడీపై సగం ధరకు ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు ఇప్పిస్తానని ఊరూరా ప్రచారం చేశాడు. తొలుత కొందరి రైతులు వద్ద డబ్బులు తీసుకొని చెప్పిన ప్రకారం ట్రాక్టర్లు, పనిముట్లు తెచ్చి ఇచ్చాడు. ఒక కంపెనీ ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేసి రైతులకు ఇచ్చి ఐటీసీ సంస్థ ద్వారా తెచ్చానని తెగ ప్రచారం చేశాడు. దీంతో చాలామంది రైతులు నమ్మి అతనికి డబ్బు ఇచ్చారు.

ఐటీసీ సంస్థ బ్రాండ్‌తో వసూళ్లు ఇలా...

దేశవ్యాప్తంగా ఐటీసీ సంస్థకు మంచి పేరు ఉండటంతో ఆ నమ్మకమే మోసానికి పునాదిగా వైసీపీ నేత వాడుకున్నాడు. దీంతో వందలాది మంది రైతులు ట్రాక్టర్లు, పనిముట్ల కోసం నాగార్జునరెడ్డికి డబ్బులు ఇచ్చారు. అప్పుడప్పుడూ ఒక్కో ఊరిలో ఒకరికి ట్రాక్టర్, కొన్ని పరికరాలు కొనుగోలు చేసి ఇస్తూ మిగిలిన వారికి ఎరవేశాడు. దీంతో చాలా మంది డబ్బులు కట్టారు. ఆ క్రమంతో సకాలంలో పరికరాలు ఇవ్వకపోవడంతో గట్టిగా అడిగిన వారికి అదిగో వస్తున్నాయ్, ఇదిగో వస్తున్నాయ్ అంటూ వాయిదాలు చెబుతూ వచ్చాడు. ఈ వ్యవహారం గత మూడేళ్లలో జోరుగా జరిగింది. కొంతమంది రైతులకు ట్రాక్టర్లు, పరికరాలు అందించడంతో మిగిలిన వారు కొద్ది రోజుల తర్వాతైనా వస్తాయన్న ఆశతో ఎదురుచూశారు. డబ్బులు చెల్లించి ఏడాది దాటినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా సాకులు చెబుతున్నాడు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదని రైతులు మౌనం వహించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల క్రితం ముండ్లమూరు మండలానికి చెందిన టి.నారాయణరెడ్డి, మరికొందరు రైతులు జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్ డీఎస్పీ లక్ష్మీనారాయణను ఆదేశించారు.



విచారణలో ఒప్పుకున్న నిందితుడు

బాధిత రైతులు కొందరు డీఎస్పీ లక్ష్మీనారాయణను కలిసి వసూళ్ల దందాను వివరించారు. ఆయన వెంటనే ముండ్లమూరు ఎస్సై నాగరాజును విచారణ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు రైతులు ముండ్లమూరు ఎస్సైను కలిసి పరిస్థితిని వివరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగార్జునరెడ్డిని ఎస్సై వెంటనే పిలిపించి మాట్లాడారు. తాను ట్రాక్టర్లు, రోటావేటర్లు, ట్రక్కులు, ఇతర వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై సగం ధరకు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని విచారణలో నాగార్జునరెడ్డి అంగీకరించాడు. తనకు కొంత గడువు ఇస్తే రైతులు వద్ద తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లిస్తానని చెప్పినట్లు సమాచారం. ఇలా సుమారు రూ.4 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అధికారులు తమ సొమ్ము వీలైనంత త్వరగా ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వరద బాధితులకు అండగా..



మంత్రులు నారా లోకేష్, స్వామికి చెక్కును అందజేస్తున్న సత్య, తెలుగుదేశం పార్టీ నాయకులు

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులకు అండగా మేమున్నామంటూ పొన్నలూరు మండల టీడీపీ నాయకులు ముందుకొచ్చారు. రూ.7.11లక్షల విరాళాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు బుధవారం అందజేశారు. అందులో టీడీపీ మండల పార్టీ తరఫున రూ.5.80లక్షలు, ఫైరెడ్డిపాలెం గ్రామ టీడీపీ నుంచి 81వేలు, టీడీపీ మండల నాయకుడు పసల వెంకటరావు వ్యక్తిగతంగా రూ.50వేలు ఉన్నాయి. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండవ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళాలో 103 మంది ఎంపిక



మేళాలో పాల్గొన్న అధికారులు, కంపెనీల ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11: ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో బుధవారం నిర్వహించిన అప్రంటిస్ మేళాలో 103 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సహాయ అప్రంటీస్ సలహదారు, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీ. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఐసీ జీఎం శ్రీనివాసరావు, ఉపాధి కల్పన అధికారి టి.భరద్వాజ్, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, డీఎస్‌డీవో రవితేజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పలు కంపెనీలు హాజరైన ఈ మేళాలో 224 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 103 మందిని ఎంపిక చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు విద్యార్థులను కోరారు.

కార్మికుల పట్ల ఉదారంగా ఉండాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చీమకుర్తి, సెప్టెంబరు 11: విజయవాడలో వరద బాధితులకు సేవలందించి అనారోగ్యంబారిన పడిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పట్ల ఉదారత ప్రదర్శించాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం ఈమేరకు చీమకుర్తిలో కమిషనర్ ఈశ్వరరాజును కలిసిన కార్మికులు వినతిపత్రం అందజేశారు. అనారోగ్యం బారిన పడిన కార్మికలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలని, వారిని డ్యూటీకి రమ్మని ఒత్తిడి చేయవద్దని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పద్మ, గోవిందు, ఎలీష, చెన్నమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

బధిరుల పాఠశాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

చీమకుర్తి, సెప్టెంబరు 11: చీమకుర్తి పట్టణంలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలను బుధవారం ఆర్డీవో సుబ్బారెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యను, వసతి సౌకర్యాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య అంజిరెడ్డి పాల్గొన్నారు.

చాపలు, వాటర్‌బాటిళ్లు అందజేత



దివ్యాంగులకు వస్తువులను అందజేస్తున్న ఏడీ అర్చన

ఒంగోలు నగరం, సెప్టెంబరు 11: దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరం సంతపేటలోని దివ్యాంగుల వసతి గృహంలోని విద్యార్థులకు బుధవారం చాపలు, వాటర్‌బాటిళ్లను అందజేశారు. దివ్యాంగులైన విద్యార్థులకు నిత్యం అవసరమైన చాపలు, వాటర్ బాటిళ్లను ఆ శాఖ ఏడీ అర్చన చేతుల మీదుగా అందించారు. వసతిగృహంలోని విద్యార్థులకు వీటిని అందజేయటం హర్షణీయమని పేర్కొన్నారు. గతంలో కూడా దివ్యాంగ్ రక్షక్ ఫైండేషన్ వారు దివ్యాంగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీవీ.నరసింహారావు, షేక్ గౌసియా, ధనలక్ష్మి, అంజనేయులు, ఆమోదులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ



అంజలకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఒంగోలు నగరం, సెప్టెంబరు 11: జిల్లాలోని సీఎస్‌పురంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతిగృహం వార్డెన్ ఏవీ.చెన్నయ్యపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం ఒంగోలులో ఆ శాఖ జిల్లా అధికారి అంజలకు ఫిర్యాదు చేశారు. వార్డెన్ సక్రమంగా మెనూ పాటించటం లేదని, వసతిగృహంలోని మహిళా వర్కర్ల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే తాలూకా మనిషిని అని చెప్పుకుంటూ విధులకు సక్రమంగా విధులకు హాజరుకావటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అంజల స్పందిస్తూ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 11 : కామేపల్లిలో ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.గీత ఒక ప్రకటనలో తెలిపారు. 'కామేపల్లిలో విచ్చలవిడిగా ఆక్రమణలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. గ్రామంలోని కొండపి రోడ్డులో ఉన్న హైస్కూల్ ప్రహరీ ముందు, పీహెచ్‌సీ, వెటర్నరీ వైద్యశాల ముందు కొందరు సిమెంటు స్తంభాలు సరిహద్దులుగా పాతిన విషయాన్ని ఆర్ అండ్‌బీ జరుగుమల్లి మండల ఏఈఈకి, ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోపీఆర్డీకి ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని జతచేసి ఆమె జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు.

ముమ్మరంగా నువ్వు కోతలు

పొగాకు, శనగ సాగుకు రైతుల సన్నద్ధం



పొలంలో ఉన్న నువ్వు గూళ్లు



ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

కొండపి, సెప్టెంబరు 11 : నియోజకవర్గంలో నువ్వు కోతలు ముమ్మరమయ్యాయి. కొండపి, జరుగుమల్లి మండలాల్లోని దాదాపు 6 వేల ఎకరాల్లో నువ్వు పంటను రైతులు ఈ ఏడాది జూన్‌లో సాగు చేశారు. అనంతరం ప్రకృతి ప్రతికూలత కారణంగా కాపు సరిగా లేకపోవడంతో కొందరు దున్నేశారు. ప్రస్తుతం వెన్నూరు, కె.ఉప్పలపాడు, కొండపి, కట్టుబడివారిపాలెం, ఫైడిపాడు, కామేపల్లి పరిసర గ్రామాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో నువ్వు పంట కోతకు వచ్చింది. దీన్ని కోసి గూళ్లు వేస్తున్నారు. కొంతమంది రైతులు నూర్పిళ్లు ప్రారంభించారు. ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తున్నదని రైతులు తెలిపారు. ప్రస్తుతం నువ్వులు క్వింటా ధర రూ.10వేల వరకూ ఉంది. ఖర్చులుపోను ఐదారువేల వరకూ ఆదాయం వస్తోంది. ఇటీవల వర్షాలు కురిసి పొలాలు పదును కావడంతో రైతులు పొగాకు, శనగ సాగుకు సన్నద్ధమవుతున్నారు. అందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

డీసీఏవోపై దాడి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలి

- ఎస్పీకి చీఫ్ సెక్రటరీ ఆదేశం
- కాలయాపన చేస్తున్న పోలీసులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 11: ఒంగోలులో జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి (డీసీఏవో) రాజశేఖర్‌పై జరిగిన దాడి కేసును చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ఆరా తీశారు. డీజీపీతో మాట్లాడి వివరాలు సేకరించారు. దీంతో డీజీపీ నేరుగా ఎస్పీ దామోదర్‌తో మాట్లాడి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే సీసీ ఫుటేజీలో కొంత కీలకమైన సమాచారం సేకరించిన పోలీసులు దర్యాప్తులో ముందుకు సాగడం లేదు. రాజశేఖర్ అనుమానించిన కొంత మంది ఉద్యోగులను బుధవారం పోలీస్‌స్టేషన్ కు పిలిచి విచారించి వారి స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. అదేక్రమంలో ఉద్యోగ సంఘాలు రాజశేఖర్‌పై జరిగిన దాడిని ఖండించి సంఘీబావం తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో ఐదుగురు నిందితులు దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు వారు ఎవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే దుండగులు మోటార్‌సైకిళ్ల పై పరారీ అయినట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా రాజశేఖర్‌పై దాడి చేసిన సమయంలో అక్కడ వినాయక విగ్రహం వద్ద ఉన్న ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే జిల్లా అధికారిపై ఇలా దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా ఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నా కేసు ఓ కొలిక్కి రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కమిషనర్‌కు కార్పొరేటర్ల విజ్ఞప్తి

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 11: ఒంగోలు నగరం విశ్వాస్‌నగర్‌లో గల హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని వైసీపీ కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు కోరారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పరిధిలోని 19, 30, 31వ డివిజన్లలో ఎవరైనా మరణిస్తే వారి దహనసంస్కారాలు ఈ శ్మశానవాటికలో చేస్తుంటారని తెలిపారు. అయితే ప్రస్తుతం అక్కడ పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని చెప్పారు. కనీసం గేట్లు లేవని, ప్రహరీ అసంపూర్తిగా ఉందని, ఇతర సౌకర్యాలు లేని కారణంగా ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఈ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ.19 లక్షలు పనులకు టెండర్లు కూడా పిలిచారని, ప్రస్తుతం ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి లోపలకు వెళ్ళే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చచేసి దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కమిషనర్‌ను కోరారు.

చేపల చెరువు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- ఇరిగేషన్ ఎస్‌ఈకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11 : చేపలు పట్టుకోవడం కోసం మోపాడు చెరువులో నీటిని అక్రమంగా విడుదల చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులోని ఎస్‌ఈ కార్యాలయంలో ఇరిగేషన్ ఎస్‌ఈకి వారు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లాకార్యదర్శి ఎం ఎల్.నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఉన్న వర్షాధారిత చెరువైన మోపాడు చెరువులో నీరు చేరడం అంతంత మాత్రంగానే ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో 9 అడుగుల మేర నీరు చేరిందని, అయితే చెరువులో చేపలు పట్టుకునేందుకు కాంట్రాక్టర్లు నీటిని అక్రమంగా మొదటి తూము ద్వారా వదిలారని చెప్పారు. కంభాలదిన్నె మెయిన్ కెనాల్‌కు గండికొట్టారని ఫిర్యాదు చేశారు. లక్ష్మీనరసింహపురం వద్ద కెనాల్‌కు గండి కొట్టి ఉత్తర వైపు కిలో మీటరు వరకు ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీసి పొలాల వైపు నీటిని మళ్ళించడంతో ఎస్సీ, మైనార్టీలకు చెందిన పొలాల్లో నీరు నిలబడికోతకు గురయ్యాయని చెప్పారు. ఈ ఘటనపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.వెంకట్రావు, కార్యదర్శి కె.వీరారెడ్డి పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులు.. నిమజ్జనోత్సవాలు

మండలపాల వద్ద భక్తుల సందడి • నిమజ్జనానికి తరలిన పలు విగ్రహాలు • పలుచోట్ల అన్నదానాలు • హాజరైన ఎంపీ మాగుంట



ద్వారకానగర్‌లో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట



వెంగయ్యసున్నంబట్టికాలనీలో మట్టి గణేషుడి నిమజ్జనం



నిమజ్జనానికి కొత్తపట్నం సముద్రపు తీరానికి తరలుతున్న విగ్రహాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 11: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఒంగోలు నగరంలో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఐదవ రోజు కావడంతో పలు విగ్రహాలను నిమజ్జనానికి కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల సముద్రతీరానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు వినాయకుని రిబ్బన్లు, బ్యాడ్జీలు ధరించి తప్పెట్లు వాయిద్యాల మధ్య సందడి చేస్తూ నగరోత్సవాన్ని నిర్వహించారు. ఇక స్థానిక కర్నూల్‌రోడ్డు వెంగయ్య సున్నంబట్టికాలనీలో పర్యావరణ పరిరక్షణ నినాదంతో మట్టి వినాయకుని చేసి నిమజ్జనం చేశారు. నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పాటిబండ్ల వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని బిందెలతో పసుపు నీళ్లు తీసుకువచ్చి మండపం వద్ద వినాయక నిమజ్జనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జి.లక్ష్మీనారాయణ, ఆనాల అంజనీకుమార్, కొప్పోలు రంగారావు, పాటిబండ్ల రమణ, సీతామహాలక్ష్మి, రాజేశ్వరమ్మ, నిసిజ తదితరులు పర్యవేక్షించి సహకరించారు. అటు నగరంలో పలు మండపాల వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రదేశాలలో నవరాత్రి పూజలు కొనసాగుతున్నాయి.

చీమకుర్తిలో...

చీమకుర్తి: వినాయక చవితిని పురస్కరించుకుని మండపాలలో కొలువైన ప్రతిమలు ఒక్కొక్కటిగా నిమజ్జనానికి తరలుతున్నాయి. బుధవారం చీమకుర్తి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం ఊరేగింపుగా



సూర్యానగర్‌లో ఊరేగింపుగా తరలివెళ్తున్న భక్తులు

తరలివెళ్లింది. ఈ సందర్భంగా జరిగిన వేలంలో గణేష్ లడ్డూని భక్తుడు కోడూరి శ్రీనివాసరావు రూ.33,500లకు దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని సూర్యానగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూని గోసి శ్రీనివాసరావు రూ.19వేలకు దక్కించుకున్నారు. ఇక్కడి విగ్రహన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. తూర్పుపాలెం సీతారామస్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద లడ్డూని గౌరవబోయిన కోటేశ్వరరావు రూ.45వేలకు దక్కించుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు ముమ్మరగస్తీని ఏర్పాటు చేశారు.

కొండపి మండలంలో..



కె.ఉప్పలపాడులో..

కొండపి: గణేష్ నిమజ్జనాలు గ్రామాల్లో కోలాహలంగా జరుగుతున్నాయి. డీజేలు, డప్పులు, బాణ సంచా మోతల మధ్య ప్రజలు వినాయకుడి విగ్రహాలను పాకల తీరానికి తరలిస్తున్నారు. మండలంలోని కె.ఉప్పలపాడులో గణనాథుడి నిమజ్జనం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకుడు సోమరాజుపల్లి రాఘవేంద్రశర్మ వినాయకుడికి హారతులిచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి



విద్యుత్ సమస్యను మనోజ్‌కుమార్‌కు వివరిస్తున్న కాలనీవాసులు

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 11 : మండలంలోని విప్పగుంట ఎస్సీ కాలనీలో లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు జనసేన నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు కాలనీలో పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు లోఓల్టేజీ సమస్యను చెప్పగా వెంటనే మనోజ్‌కుమార్ విద్యుత్‌శాఖ ఏఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తానని ఏఈ హామీ ఇచ్చారు.

అవీ.. ఇవీ..

ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రవేశాలకు నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 11: ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ప్రవేశాలకు ఈనెల 17న చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీసెట్24లో అర్హత సాధించిన విద్యార్థులు వెంటనే కళాశాలలో సంప్రదించాలని కోరారు. వారికి వంద శాతం ఫీజు రీఎంబర్స్‌మెంట్ అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థినీలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 11: పోగొట్టుకున్న బ్యాగ్‌ను పోలీసులు బాధితునికి అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. స్థానిక కమ్మపాలెంనకు చెందిన మానేపల్లి దుర్గామల్లేశ్వరరావు తనకు బాపూజీ మార్కెట్ వద్ద ఓ బ్యాగ్ దొరికిందని టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావుకు తెచ్చి ఇచ్చారు. దీంతో ఆ బ్యాగ్ ఎవరిదని వాకబు చేసిన సీఐ, ఒంగోలు మండలం చేకూరుపాడుకు చెందిన దారా కోటేశ్వరరావుకు చెందినదిగా గుర్తించి అతనిని పిలిపించి అందజేశారు. ఆ బ్యాగ్‌లో బంగారం చైన్ ఉందని గుర్తించారు. కోటేశ్వరరావు మోపెడ్‌పై ఒంగోలు వచ్చాడు. బాపూజీ కాంప్లెక్స్ సమీపంలో బ్యాగ్ జారీ కింద పడింది. దీంతో అతను గమనించకుండా ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ బ్యాగు దుర్గామల్లేశ్వరరావుకు దొరకడంతో టూటౌన్ పోలీసులకు ఇవ్వగా బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా దుర్గామల్లేశ్వరరావును సీఐ అభినందించారు. స్టేషన్ రైటర్ వెంకట్రావు పాల్గొన్నారు.

బీసీ కులగణనను చేపట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11: కేంద్రప్రభుత్వం బీసీ కులగణనను చేపట్టకుండా మొండిగా వ్యవహరిస్తుందని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కులగణన జరిగితే బీసీలు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా ఎంతో అభివృద్ధి చెందుతారన్నారు. అందువల్ల కేంద్రప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

తూర్పుకమ్మపాలెంలో బైక్ చోరీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 11: ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన ఒంగోలు నగరం తూర్పు కమ్మపాలెంలో మంగళవారం రాత్రి జరిగింది. వెజండ్ల లింగయ్య తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేయగా తెల్లవారి లేచే సరికి వాహనం కనిపించలేదు. ఈమేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆప్రాంతంలో తరుచుగా అనేక దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి భారీగా బంగారం అపహరిచుకు వెళ్ళారు. అంతేగాకుండా బైక్‌ల్లో పెట్రోలు అపహరించడం తరచుగా జరుగుతోంది. ఇప్పటికైనా పోలీసులు తమ ప్రాంతంలో గస్తీ పెంచిన దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్య



మాట్లాడుతున్న రమేష్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 11 : దివ్యాంగ విద్యార్థులకు వివిధ యాప్‌ల ద్వారా రిసోర్స్‌పర్సన్లు ప్రత్యేక విద్యను అందించాలని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎం.రమేష్ సూచించారు. బుధవారం ఒంగోలులోని రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో భవిత కేంద్రాల్లోని రిసోర్స్ టీచర్లు, హైస్కూళ్ళలోని స్పెషల్ టీచర్లకు ట్యాబ్‌ల వినియోగంపై ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. విజన్-2025లో భాగంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారన్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు, హైస్కూళ్ళలో పనిచేస్తున్న టీచర్లు కూడా ట్యాబ్‌లు అందజేశామని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశీలకులు నరసింహం మాట్లాడుతూ ట్యాబ్‌లను ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహిత అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మల్లికార్జున, రిసోర్స్‌పర్సన్లు సునీల్, లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి సిలబస్‌ను పాటించాలి

- వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 11 : ఉన్నత విద్యా మండలి ఇచ్చిన సిలబస్‌ను దృష్టిలో పెట్టుకొని బీవోఎస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు విధివిధానాలు రూపొందించాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి కోరారు. బుధవారం స్థానిక యూనివర్శిటీ సమావేశపు హాలులో బోర్డు ఆఫ్ స్టడీస్(బీవోఎస్) చైర్మన్లు, కమిటీ సభ్యుల సమావేశం ప్రిన్సిపాల్ రాజమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ 16 పీజీ కోర్సులు బీవోఎస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు బ్లూప్రింట్ ప్రకారం ప్రశ్నపత్రాలను తయారు చేయాలన్నారు. పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విద్యాబోధన, ప్రశపత్రాల తయారీ వంటి విషయాలను సమావేశంలో ఖరారు చేశారు. కార్యక్రమంలో అకడమిక్ విభాగం డీన్ కె.గంగాధర్, రిజిస్ట్రార్ బి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న అంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11 : సామాజిక అణిచివేత, ఆర్థికదోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో బుధవారం కేవీపీఎస్ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజాభివృద్ధికి తమ శ్రమను ధారపోస్తున్న వారికి ప్రకృతి వనరుల్లో సహజ సమాన న్యాయాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. భూమి. నీరు, గాలి, వెలుతురు సమస్తం ప్రజలకు సమాన హక్కుగా ఉండనంతకాలం ఈ అసమానతలు నీడలా వెంటాడుతూనే ఉంటాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ గ్రామగ్రామాన కేవీపీఎస్ సంఘాన్ని నిర్మించడంతో పాటు దళితుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాజి రాజు, బక్కా జేసురత్నం, కత్తి యోబు, కె.నరేష్ పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారణ



మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 11: అవగాహనతో హెచ్‌ఐవీ సోకకుండా నివారించవచ్చని శ్రీసూర్య విద్యానికేతన్ కళాశాల కరస్పాండెంట్ రామళ్ల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఎయిడ్స్ నిర్మూలన నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం మద్దిరాలపాడులోని శ్రీసూర్యవిద్యానికేతన్‌లో నిర్వహించిన మీకు తెలుసా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకూ దూరంగా ఉండాలన్నారు. యువత హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకుని ఆరోగ్యమైన జీవనాన్ని అలవర్చుకోవాలని కోరారు. హెచ్‌ఐవీ సోకిన వారితో శృంగారం, రక్త మార్పిడి, ఆ వ్యక్తులు వాడిన సూదుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఎవరైనా హెచ్‌ఐవీ బారినపడితే ప్రభుత్వ ఐసీటీసీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు, వైద్యం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి, హెల్ప్ డైరెక్టర్ బీవీ.సాగర్, ఓఆర్‌డబ్ల్యూ మల్లేశ్వరి, సిబ్బంది కృష్ణవేణి, దివ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత రంగనాయకులు మృతి



రంగనాయకులు మృతదేహం

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 11 : మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఓలేటి రంగనాయకులు (93) వృద్ధాప్యంతో బుధవారం మృతి చెందారు. పొన్నలూరు ప్రాంతంలో అనేక ప్రజా, భూపోరాటాల్లో ఆయన పాల్గొన్నారు. రంగనాయకులు మృతదేహాన్ని సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు కాట్రగడ్డ నర్సింగరావు, మూలే శేషారెడ్డి, లాజరు, సత్యం ఉన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

సంతనూతలపాడు, సెప్టెంబరు 11: మద్యం సీసాలను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.దేవకుమార్ తెలిపారు. గంగవరం గ్రామంలో ఎం.శ్రీను తనకున్న దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం పోలీసులకు అందింది. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఎస్సై తన సిబ్బందితో వెళ్లి దాడిచేసి నిందితుడి పట్టుకుని 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెక్కిరిస్తున్న పిల్లర్లు!

పదిహేనేళ్ల నుంచి విద్యార్థినులను వెంటాడుతున్న హాస్టల్ కష్టాలు



విద్యార్థినుల హాస్టల్ భవన నిర్మాణానికి పదిహేనేళ్ల క్రితం వేసిన పిల్లర్లు నేటికీ వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఆనాటి నుంచి నేటి వరకు పాలకులు ఎవరూ దాని గురించి పట్టించుకోలేదు. ముండ్లమూరులో 2009లో ఏపీ మోడల్ స్కూల్‌ను నిర్మించారు. దానికి అనుసంధానంగా విద్యార్థులకు వసతి కోసం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 కోట్లను హాస్టల్ భవనానికి మంజూరు చేసింది. టెండరు పొందిన కాంట్రాక్టర్ 2009 డిసెంబరులో పిల్లర్లు వేశారు. ఆ తర్వాత పత్తా లేకుండా పోయారు. పదిహేనేళ్ల నుంచి పిల్లర్లకే పరిమితమై పోయింది. పాఠశాలకు వచ్చే ఆరు వందల మంది విద్యార్థులకు హాస్టల్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇళ్ల నుంచే ఉదయం ఆటోల్లో వచ్చి సాయంత్రం వరకు చదువుకొని వెళుతున్నారు. వీరిలో ఎక్కువగా మారెళ్ల, ఈదర, భీమవరం, సుంకరవారిపాలెం, వేములబండ, రమణారెడ్డిపాలెం, కెల్లంపల్లి, పులిపాడు, శంకరాపురం, పోలవరం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల విద్యార్థులు ఉన్నారు. బాలికలకు హాస్టల్‌లో ఉంటే స్థానికంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. హాస్టల్ భవనం లేకపోవటం వల్ల సాయంత్రం తిరిగి వారి ఇళ్లకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. -ముండ్లమూరు

తరలిపోతున్న గ్రావెల్



కనిగిరి పట్టణ పరిధిలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దచెరువును కొందరు అక్రమార్కులు గుల్లచేస్తున్నారు. మట్టి వ్యాపారం చేసేందుకు రాత్రిళ్లు జనం సద్దుమణిగాకా అక్రమార్కులు ట్రాక్టర్లతో చెరువు నుంచి మట్టి తరలించుకుపోతున్నా పట్టించుకునే అధికారి లేరు. మొదట్లో 200 ఎకరాలలో ఉన్న చెరువు కాలక్రమంలో ఆక్రమణకు గురైంది. ఈ చెరువు నుంచి వందలాది ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. గత ప్రభుత్వంలో పెద్ద మురాగా ఏర్పడి ట్రక్కులకు ట్రక్కులు మట్టి తరలించినట్లే ఇప్పుడూ సాగిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని ప్రజలు కోరుతున్నారు. -కనిగిరి

వరద బాధితుల కోసం రూ.5లక్షల విరాళం

• సీఎం చంద్రబాబుకు అందజేసిన సాయిసుందర్



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న సాయిసుందర్, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఒంగోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ తనయుడు ఐటీసీ వెండర్ మండవ సాయిసుందర్ రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌తో కలిసి ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బుధవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి అభినందిస్తూ 2014 అమరావతి నిర్మాణం కోసం కూడా విరాళం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో దుగ్గినేని వెంకట్రావు, మండవ సాయిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50లక్షలు పలికిన లడ్డూ

• కొణిజేడులో ఘనంగా వినాయక గ్రామోత్సవం

టంగుటూరు, సెప్టెంబరు 11: మండలంలోని కొణిజేడు గ్రామంలో వినాయకని మజ్జనంలో భాగంగా గ్రామోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. స్థానిక కమ్మపాలెం బ్రహ్మంగారి గుడి సమీపంలోని తెలుగు యువత యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో పలువురు ఔత్సాహికులు పాల్గొని పాట పాడారు. గ్రామానికి చెందిన పైనేని శ్రీనివాసరావు అత్యధికంగా రూ.1.50లక్షలకు వేలం పాడి స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామస్థులంతా పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామా గోపీ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం నిమజ్జనం కార్యక్రమం జరగనుంది.



లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసరావు

అనర్హులైన సభ్యులను మాత్రమే తొలగిస్తున్నాం

• ఇన్‌చార్జి డీసీవో ఇందిరాదేవి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 11 : ఏపీ సహకార సంఘాల చట్టం-1964 ప్రకారం అనర్హులైన సభ్యులను మాత్రమే సొసైటీల నుంచి తొలగిస్తునత్నట్లు ఇన్‌చార్జి డీసీవో ఎస్.ఇందిరాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో సొసైటీల్లో సభ్యుల కుదింపు శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. జిల్లాలోని సొసైటీల్లో కంప్యూటరీకరణ జరుగుతున్న నేపథ్యంలో సభ్యుల వివరాలను కంప్యూటరీకరించేందుకు కేవైసీ డాక్యుమెంట్లు, సభ్యుల పొలం వివరాలు, ఆధార్, పాన్‌కార్డులు అవసరమవుతాయన్నారు. సొసైటీల్లో ఈ వివరాలు అందించని సభ్యులను మాత్రమే సర్వసభ్య సమావేశం ద్వారా తొలగిస్తున్నారని తెలిపారు ఈ సమావేశం జరిగేలోపు ఈ డాక్యుమెంట్లు, ఇతర వివరాలు అందిస్తే వారిని కూడా సభ్యులుగా కొనసాగిస్తామన్నారు. సభ్యులు ఎవరైనా అక్రమంగా తొలగిస్తే వారు సంబంధిత విభాగ సహకారాధికారిని సంప్రదించి వారి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు.

వరద ప్రాంతాల్లో పని చేసేందుకు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలునగరం, సెప్టెంబరు 11: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పని చేసేందుకు జిల్లాలో ఆసక్తి ఉన్న ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు తమ వివరాలను తెలియజేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజయాదవ్ బుధవారం కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న కరెంటు, ప్లంబింగ్ పనులను నిర్వహించేందుకు నైపుణ్యం కలిగిన వారు కావాలన్నారు. వీరికి రోజుకు కనీస వేతనంగా రూ.1000 చెల్లిస్తామని, అదనంగా పని మేరకు అధిక చెల్లింపులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారికి విజయవాడలో ఉచిత వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సుముఖంగా ఉన్న వారు తమ వివరాలను న్యాక్ ట్రైనింగ్ సెంటర్, ఇందుర్తినగర్ ఫస్టు లైను, రైల్వే అండర్ బ్రిడ్జి, నియర్ కొత్తపట్నం బస్టాండ్, ఒంగోలు చిరునామాలో తమ విరాలను తెలియజేయాలన్నారు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, స్కిల్ సర్టిఫికెట్, ఈ-శ్రమ్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో వివరాలను అందజేయాలని, సొంత టూల్‌కిట్ కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9989767255, 950556949 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్



నూజివీడు టౌన్, సెప్టెంబరు 11: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్‌ను నియమిస్తూ వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సంద్ర అమరేంద్రకుమార్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. 2016లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ట్రిపుల్ ఐటీలో చేరిన ఆయన 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఆర్కే వ్యాలీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, డైరెక్టర్‌గా పని చేయడంతో పాటు ఇటీవల ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రిజిస్ట్రార్‌గా నియమించడం పట్ల నాలుగు ట్రిపుల్ ఐటీల అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

15మందిపై బైండోవర్ కేసులు

మద్దిపాడు, సెప్టెంబరు 11: మండలంలోని లింగంగుంట గ్రామానికి చెందిన 12 మంది, మల్లవరం గ్రామానికి చెందిన ముగ్గురిపై బుధవారం సాయంత్రం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున వారిపై కేసు నమోదు చేశామన్నారు. వినాయక మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ఉండాలి కానీ, ఘర్షణలు పెట్టుకోకూడదని, అలా జరిగితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నాలుగు టిప్పర్లు సీజ్ : తాళ్లూరు వైపు నుంచి మద్దిపాడు వస్తున్న నాలుగు ఇసుక టిప్పర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు, సెప్టెంబరు 11 : అక్రమంగా తరలిస్తున్న 60బస్తాల రేషన్ బియ్యాన్ని సీఐ భీమానాయక్ తన సిబ్బందితో పట్టుకొన్న సంఘటన మంగళవారం రాత్రి పామూరులో జరిగింది. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలివెళ్తున్నాయన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. మినీ టెంపో వాహనాన్ని, అందులోని 60 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

బైక్‌తో లారీని ఢీకొనడంతో ఘటన

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు11: వినాయక చవితి పండుగ సెలవులకు ఇంటికి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చింతల వెంకటమణికంఠ(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం తెల్లవారు జామున ఒంగోలు నగరం వెంగముక్కపాలెం వెళ్లే దారిలో జరిగింది. వివరాలలోకి వెళితే.. టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన వెంకటమణికంఠ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక చవితి పండుగకు ఇంటికి వచ్చిన ఆయన ఈనెల 10న కొణిజేడు లో తన స్నేహితుడు జగదీష్ దగ్గరకు వెళ్ళి మోటార్‌సైకిల్‌ను తీసుకొన్నుడు. ఒంగోలులో నివాసం ఉంటున్న తన బావ సాయి ఇంటికి వెళుతున్నట్లు ఇంట్లో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. అయితే వెంగముక్కపాలెం రోడ్డు సమీపంలోని సాయి ఐటీఏ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు మార్జన్‌లో పార్కు చేసిన లారీని వెంకటమణికంఠ మోటార్‌సైకిల్‌పై వస్తూ తెల్లవారిజామున 4 గంటల సమయంలో ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108వాహనం ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతు వెంకటమణికంఠ మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తల్లి ధనలక్ష్మి ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ వరద బాధితులకు రూ.47.16 లక్షలు అందజేత

దర్శి, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు రూ.47.16200 లక్షల చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, దాతలు అందించిన విరాళం రూ.37,16200 లక్షలు, డాక్టర్ లక్ష్మి దంపతులు రూ.10 లక్షలు కలిపి సీఎంకు అందించారు. ఈ సందర్భంగా తుఫాన్ బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరించినందుకు సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చియ్య, ముండ్లమూరు, దొనకొండ, తాళ్లూరు, కురిచేడు మండలాల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, నాగులపాటి శివకోటేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, నెమలయ్య పాల్గొన్నారు.



విరాళం చెక్కును సీఎంకు అందజేస్తున్న లక్ష్మి, సాగర్ దంపతులు

వరద బాధితులకు రూ1,22,700 విరాళం

తాళ్లూరు, సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తూర్పుగంగవరం గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య బుధవారం దర్శిలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు అందజేశారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సూచనతో గ్రామ టీడీపీ కమిటీ గ్రామంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.1,22,700లను టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ద్వారా సీఎం సహాయనిధికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామటీడీపీ ఎస్సీ సెల్ నేత చాట్లధానీ పాల్గొన్నారు.





వాహనాన్ని ప్రారంభిస్తున్న పాపారావు

జనసేన ఆధ్వర్యంలో దుస్తుల రవాణా

దర్శి, సెప్టెంబరు 11 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు నియోజకవర్గ నాయకులు కొనుగోలు చేసిన వివిధ రకాల 1600 వస్త్రాలను విజయవాడకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు దుస్తుల వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 1000 చీరలు, 200 పంజాబీ డ్రస్సులు, 200 దుప్పట్లు, 180 షర్టులు సమకూర్చి విజయవాడ పంపినట్లు జనసేన నాయకుడు కుప్పాల పాపారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ నాయకులు సంగా తిరుపతిరావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు చిన్నా, జనసేన నాయకులు కోటి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

14న జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

మేదరమెట్ల, సెప్టెంబరు 11 : ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 14వ తేదీన ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని పీడీసీఈ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రావినూతలలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జట్టు ఎంపిక వాయిదా పడిందన్నారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో జరుగుతాయని నాగేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు అక్టోబరు 1వ తేదీ నుంచి కడప, అనంతపూరంలో జరిగే ఆంధ్ర క్రికెట్ ఆధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పని సరిగా వైట్ డ్రస్, షూష్, సొంత కిట్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రం (ఫారం-5), ఆధార్‌కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. బాలుర అండర్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 1-9-2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం కోచ్ సుధాకర్, బి.చంద్రశేఖరం మొబైల్ నెంబర్లు 9701088333, 9246222999 కు ఫోన్ చేసి సంప్రదించాలని నాగేశ్వరావు తెలిపారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి

కురిచేడు, సెప్టెంబరు 11 : మండలం వెంగాయపాలెం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా దర్రిపాడు మండలం గోగిదిన్నె గ్రామానికి చెందిన పెద్దిబోయిన ఉదయ్‌కిరణ్ (18) గుంటూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అతడు నంద్యాల నుంచి గుంటూరుకు రైలులో బయలుదేరాడు. గుంటూరు- గుంతకల్ రైలు మార్గంలో కురిచేడు సమీపంలో 104/4 కిలోమటరు సమీపంలో ఉదయ్‌కిరణ్ రైలు నుంచి జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలవడంతోపాటు రైల్వే ట్రాక్ పక్కనే గడ్డితో ఉన్న గుంతలో పడిపోయాడు. బుధవారం ఉదయం ఆ దారిని వెళ్లే వారు గమనించి అతడిని ట్రాక్టర్‌లో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కిరణ్ మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఒంగోలు సమపంలోని ముక్తినూతలపాడుకు చెందిన జి.అచ్యుత్‌కుమార్ (50) రెండు సంవత్సరాలుగా అద్దంకి మండలం కుంకుపాడు ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 6వ తేదీన ఒంగోలు నుంచి కుంకుపాడు పాఠశాలకు బైక్‌పై వస్తూ మోదేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన అచ్యుత్‌కుమార్‌ను మోదేపల్లి, అద్దంకి సీహెచ్‌సీ వైద్యశాలలో చికిత్స అనంతరం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన్ని విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో బంధువులు బుధవారం సాయంత్రం అక్కడకు తీసుకువెళ్లగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అచ్యుత్‌కుమార్ మృతి పట్ల సీఆర్పీ రమేష్, ఏపీటీఎఫ్ అద్దంకి మండల శాఖ సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం : కలెక్టర్

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 11: జిల్లా పశ్చిమ ప్రాంతంలో పండ్ల తోటలను ప్రోత్సహించేలా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. దోర్నాలలో బుధవారం ఆమె మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకటత్రినాగ్, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత రామచంద్రకోటలో ఉపాధి కింద సాగు చేసిన తైవాన్ జామ తోటను, చిన్నదోర్నాల వద్ద తీగలేరుపై శిథిలావస్థకు చేరిన చప్టాను, అడ్డరోడ్డు వద్ద ఒట్టి పోయిన చేతిపంపును పరిశీలించారు. నీటి కుంట నిర్మాణానికి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. తదుపరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జూనియర్ కళాశాలలోనే డిగ్రీ విద్యార్థులు చదువు కోవాల్సి వస్తుందని, డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు, హాస్టలు వసతి ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ సావిత్రి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తరువాత ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఆర్‌టీసీ బస్టాండు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంతో ప్రాముఖ్యత గల పట్టణమని, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం, మహానంది వంటి పుణ్యక్షేత్రాలకు రోజూ వేల సంఖ్యల్లో ప్రయాణిస్తుంటారని బస్టాండు నిర్మాణం చేపట్టాలని ఎరిక్షన్‌బాబు కలెక్టర్‌కు వివరించారు. ఈక్రమంలో నేషనల్ హైవే కింద భూములు కోల్పోయిన కొందరు తమకు పరిహారం అందలేదని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్ రెడ్డి, తహసీల్దారు శాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి,ఏవో జవహర్‌లాల్ నాయక్, అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు,షేక్ మంజూర్ బాష, కొప్పుల సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్, బాష, బట్టు సుధాకర్ రెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షులు వీరారెడ్డి, జనసేన అధ్యక్షుడు కేతి మురళి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఈ-పంట నమోదు పూర్తి చేస్తాం : ఏవో

సంతనూతలపాడు, సెప్టెంబరు 11: మండలంలో ఈ-పంట నమోదును త్వరలో పూర్తి చేస్తామని ఏవో పావని పేర్కొన్నారు. ఈ-పంటలో రీసర్వే తంటా అనే కథనం బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కాగా దీనిపై ఏవో స్పందించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2024-25 సంవత్సరానికి మండలంలో 1,399 ఎకరాల పంట సాగుచేశారని, దానిలో 1,237 ఎకరాలను ఈ-పంటలో నమోదు చేసినట్లు తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో మొత్తం 2,523 జాయింటు ఎల్‌పీ నెంబర్లు రావడం వల్ల 8,565 ఖాతాలకు సంబంధించి రైతుల విస్తీర్ణం వీఆర్వోలు వారి ఈ-పంట లాగిన్‌లో అప్‌డేట్ చేయడం ద్వారా నమోదుకు అవకాశముంటుందని చెప్పారు. ఇప్పటివరకు 88శాతం వరకు అప్‌డేట్ చేశామని, 991 ఖాతాలు చేయాల్సినవి ఉన్నట్లు వివరించారు. వీఆర్వోలను సమన్వయం చేసుకుంటూ వందశాతం ఈ-పంట పూర్తిచేస్తామని తెలిపారు.

సాయిబాబా ఆలయ వ్యవస్థాపకుడు గురవయ్య కన్నుమూత



గురవయ్య (ఫైల్)

కొండపి, సెప్టెంబరు 11 : కొండపిలోని సాయిబాబా ఆలయ వ్యవస్థాపకుడు, విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు పెండ్యాల గురవయ్య (90) మృతి చెందారు. ఆయన నాలుగేళ్లుగా అనారోగ్యంతో మంచంలో ఉన్నారు. బుధవారం కొండపిలోని స్వగృహంలో కన్నుమూశారు. గురవయ్య పలు ధార్మిక కార్యక్రమాలు చేశారు. ప్రధానంగా కొండపిలోని సాయిబాబా ఆలయ నిర్మాణానికి అవిరళ కృషి చేశారు. 22 సంవత్సరాలపాటు ఆలయ కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. రెండేళ్ల నుంచి గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పి.సీతారామయ్య, అద్దేపల్లి బాబూరావు, చెన్నుపాటి ప్రసాదరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఆరు గ్రానైట్ లారీలు పట్టివేత

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 11: ఎలాంటి అనుమతులు లేని ఆరు గ్రానైట్ లారీలను పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం అర్ధరాత్రి చీమకుర్తి నుంచి చెన్నయ్ వైపు తరలి పోతున్న మూడు లారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఆపి పత్రాలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేశారు. అనంతరం ఒంగోలు రవాణాశాఖ కార్యాలయం వద్దకు తరలించారు. అదేవిధంగా మరో మూడు లారీలను మైనింగ్ విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినూత్న ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బీఎస్సీ అధినేత మాయావతి చేపట్టిన ప్రతిఘటనకు కార్యక్రమానికి సంఘీభావంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ఒంగోలులో వినూత్న ర్యాలీ నిర్వహించారు. మాలమహానాడు అధ్యక్షుడు బిక్కా వసంతరావు ఆధ్వర్యంలో పల్నాటి చరిత్రలో మాలకన్నమదాసుడు, బాలనాగమ్మల వేషధారణలతో ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఒంగోలులో మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిక్కా చెన్నయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు సవరణ చేయకుండా కులాలను విడదీయడం దారుణంగా ఉందని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో వర్గీకరణను క్రిమిలేయర్‌ను యాడ్ చేయడాన్ని ఖండించారు. వర్గీకరణను రద్దు చేసేంత వరకు పోరాడుతామని ఆయన తెలిపారు కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



సిద్ధం చేస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వరద బాధితులకు నిత్యావసరాలు

- ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 11: బుడమేరు తెగి నీటమునిగి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు నిత్యావసరాలను అందజేయనున్నట్లు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక సౌజన్య ఫంక్షన్‌హాలులో బాధితులకు అందజేసేందుకు ప్యాకింగ్ చేస్తున్న నిత్యావసరాలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.40 లక్షల విలువ చేసే సామగ్రిని సిద్ధం చేస్తున్నామన్నారు. బియ్యం, పప్పు, చింతపండు, ఉల్లిపాయలు తదితర అన్ని రకాలను వేటికవి ప్యాకింగ్ చేసి అన్ని రకాలు కలిపి ఒక సంచిలోవేసి కుటుంబానికి ఒకటి చొప్పున పంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య, మాలపాటి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.



అటవీ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు

పచ్చదనాన్ని పెంచాలి

గిద్దలూరు, సెప్టెంబరు 11 : ఉన్న అడవులను కాపాడుకుంటూనే అడవుల్లో పచ్చదనాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు అన్నారు. గిద్దలూరు గుండ్లకమ్మ, తురిమెళ్ల, బేస్తవారపేట రేంజ్ ఆఫీసర్లతో ఆయన స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణతోపాటు అడవుల్లో ఎప్పటికప్పుడు మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఖాళీ స్థలాలు లేకుండా మొక్కలు నాటి వాటిని చెట్లుగా మారిస్తే వన్యప్రాణులు అటవీ వెలుపలికి రావని పేర్కొన్నారు. వన్యప్రాణులకు తాగునీరు అందే విధంగా అడవిలోని చెరువులు, కుంటలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అనుమతులు లేకుండా అడవుల్లో ఎవరు కనిపించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో, అధికారులు

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

● 15 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

మార్కాపురం రూరల్ 11 : పంటలను సాగుచేసిన రైతులు ఈ నెల 15 వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ బాలాజీనాయక్ కోరారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో బుధవారం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి ఆగ్రామంలో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసం పీల్చే పురుగులైన పచ్చ, తెల్ల దోమ నివారణకు ఇమిడా క్లోపిడ్, నీరు 1.4 నిష్పత్తిలో మొక్క కాండానికి బ్రష్‌తో పూయడం వలన దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. పత్తిలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న జింక్ లోపంతో ఆకులు పసుపు రంగులో మారుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, వీఏఏ జక్కి. గణేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

మండలంలోని తిప్పాయిపాలెం గ్రామంలో ఉద్యాన పంటలను ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ పీడీ రమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బత్తాయి తోటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. జింక్ లోపం ఉన్న చెట్లకు 1,000 మిల్లీ లీటర్ల జీవన జింక్ ఎరువును డ్రిప్ ద్వారా పంపవచ్చని, లేదా 2 నుంచి 5 గ్రాములు జింక్ సల్ఫేట్ పది రోజులకు ఒక సారి వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రిప్ జిల్లా సమన్వయ అధికారి ఓబయ్య, వీహెచ్ ఎ శివ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల అంజనేయులు

అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 11: సామాజిక అణిచివేతకు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతున్న కేవీపీఎస్ జిల్లా శిక్షణా తరగతులలో భాగంగా రెండో రోజు బుధవారం హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి తమ శ్రమను ధారపోస్తున్న వారు ప్రకృతి వనరుల్లో సహజ సమాజ న్యాయాన్ని పొందలేకపోతున్నారన్నారు. నేటికి కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతుందన్నారు. కేవీపీఎస్ సంఘాన్ని నిర్మించటంతో పాటు దళితుల సమస్యల్ని పరిష్కరించటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాజి రాజు, రఘురాం, నాయకులు ఏసురత్నం, యేబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. ఇటీవల మార్కాపురం చెరువులో పెరుగిపోతున్న ఆక్రమణలపై ఆయన దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా మార్కాపురం చెరువులో ఇండస్ట్రియల్ ఎస్టేట్, అలుగు వద్ద చెరువుకు సంబంధించిన స్థలాలను కొంతమంది వ్యక్తులు ఆక్రమించి వేసిన కంచెను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులను కాపాడుకోవాలని, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

దోర్నాలలో విస్తృత పర్యటన

డివిజన్ అధికారులతో సమీక్ష

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 11: పశ్చిమ ప్రాంతంలో పండ్ల తోటలను ప్రోత్సహించేలా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. దోర్నాలలో బుధవారం ఆమె మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రినాగ్, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత మండలంలోని రామచంద్రకోట గ్రామంలో ఉపాధి హామీ క్రింద సాగు చేసిన తైవాన్ జామ తోటను పరిశీలించారు. రైతు తిరుపతి రెడ్డి జామ సాగుకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ, ఖర్చులు, ఆదాయం వంటి వివరాలు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం చిన్న దోర్నాల వద్ద తీగలేరుపై శిథిలావస్థకు చేరిన చప్టాను ఆమె పరిశీలించారు. ఆ తరువాత అడ్డరోడ్డు వద్ద ఒట్టిపోయిన చేతిపంపును పరిశీలించారు. అక్కడ వర్షపు నీరు ఇంకేలా నీటి కుంట నిర్మాణానికి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. తదుపరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆవరణలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల విద్యార్థులు చదువుకోవాల్సి వస్తుందని విడతల వారీగా తరగతులు నిర్వహిస్తుండడం ఇబ్బందికరంగా ఉందని డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు, హాస్టలు వసతి ఏర్పాటు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తగిన చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ త్రినాగ్‌కు సూచించారు. తరువాత ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. వైద్యశాలలోని అన్ని వార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓపీ, ఐపీ బ్లాకు, ఎమర్జెన్సీ వార్డులు, మౌలిక వసతులు, పలు విభాగాలను పరిశీలించారు. వైద్యశాలలోని రోగులను వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో బ్లడ్‌బ్యాంకు, పోస్టుమార్టం,ఎక్సరే ప్లాంటు, కంటి పరీక్ష సామగ్రి, గైనకాలజిస్టు నియామకం తదితర అంశాలను పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే ఆర్‌టీసీ బస్టాండు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంతో ప్రాముఖ్యత గల పట్టణమని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం, మహానంది వంటి పుణ్యక్షేత్రాలకు రోజూ వేల సంఖ్యల్లో ప్రయాణిస్తుంటారని బస్టాండు నిర్మాణం చేపట్టాలని టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు కలెక్టర్‌కు వివరించారు. ఈక్రమంలో నేషనల్ హైవే కింద భూములు కోల్పోయిన కొందరు తమకు పరిహారం అందలేదని, న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.పరిశీలిస్తామని వారికి కలెక్టర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్ రెడ్డి, తహసీల్దారు శాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి,ఏవో జవహర్ లాల్ నాయక్, అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు,షేక్ మంజూర్ భాష, కొప్పుల సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్,బాష, బట్టు సుధాకర్ రెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షులు వీరారెడ్డి, జనసేన అధ్యక్షుడు కేతి మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

● పీఎం జన్మన్ సమీక్షలో కలెక్టర్ అన్సారియా



పెద్ద దోర్నాల, సెప్టెంబరు 11:కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం జన్మన్ ద్వారా చెంచు గిరిజనుల అభివృద్దే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మండల పర్యటనలో భాగంగా ఆమె చిన్నగుడిపాడు గ్రామం వద్ద ఆర్‌డీటీ సంస్థ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రధానమంత్రి జన్మన్‌పథకంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టిన పనులు, చర్యల పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెంచులు నివశించేందుకు సురక్షితమైన గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వైద్యం, విద్య, పోషకాహారం, సక్రమైన రహదారుల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం , స్థిరమైన జీవనోపాధులు కల్పించడం వంటి 11రకాల అభివృద్ధి పథకాల అమలును అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేయాలని సూచించారు. పీఎం జన్మన్ పథకంపై గిరిజనులకు పూర్తిగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సురేష్ కుమార్, డీటీడబ్ల్యూవో జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఐసీడీఎస్ పీడీ మాధురి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, లీడ్ జిల్లా మేనేజర్ రమేష్ బాబు, డీఎంహెచ్‌వో సురేష్, డీఈవో సుభద్ర, డీడీ విద్యాసాగర్ ఆర్‌డీటీ ఆర్‌వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముఖం చూడని వెలుగు బస్సులు

నేటికీ ఆటోలే శరణ్యం

ప్రయాణికుల జేబులకు చిల్లు

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం





ఆటోల్లో కిక్కిరిసి వెనుక నిలబడి వెళుతున్న ప్రయాణికులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 11: ఎటువంటి లాభాపేక్షా లేకుండా ప్రయాణికులను గమ్యస్థానం చేర్చేందుకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన పల్లెవెలుగు బస్సులు జాతీయ రహదారులకే పరిమితం అయ్యాయి. దీంతో పేరుకే పల్లెవెలుగులుగా తప్ప పల్లెల ముఖం కూడా చూడట్లేదు. దీంతో పల్లె వెలుగుల లక్ష్యం గమ్యం చేరట్లేదు. మండలంలో జాతీయ రహదారితోపాటు, నియోజకవర్గ కేంద్రం ఎర్రగొండపాలెంకు వెళ్ళే దారిలో ఉన్న గ్రామాలు తప్ప మిగతా ఏగ్రామంలోకీ ఆర్టీసీ బస్సులు నడిచే పరిస్థితి లేదు. కేశినేనిపల్లి, హసానాపురం, నడిగడ్డ, సోమేపల్లి, విశ్వనాథపురం, లేళ్ళపల్లి, దువ్వలి, కంకణాలపల్లి, మిరియంపల్లి, గాంధీనగర్, ఒడ్డుపాలెం, పాపన్నపాలెం, కొత్తముడివేముల, పాతముడివేముల, గణపవరం, ఎండూరివారిపాలెం, పాతఅన్నసముద్రం, కొత్తఅన్నసముద్రం, డీవీఎన్ కాలనీ, గుట్లపల్లి, వెంగాయపాలెం గ్రామాలతోపాటు అటవీప్రాంతంలో ఉన్న తండా గ్రామాలకూ బస్సు సౌకర్యంలేదు.

ఆటోలేదిక్కు

మండలంలో ఒకప్పుడు ఏమారుమూల ప్రాంతం చూసినా ఎర్రబస్సులు తలుక్కుమనేవి. తరువాత ఏటికేడు ఆర్టీసీ బస్సులు తిప్పడం మానేశారు. ఈనేపథ్యంలో ప్రయాణికులకు ఆటోలే దిక్కయ్యాయి. ఫలితంగా ఆటోవాలాలు ఆర్టీసీ కన్నా అధిక చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికుల జేబుకు చిల్లు పడుతోంది. దీనికితోడు ఆటో నిండేవరకు గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కిక్కిరిసేలా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ అధికారులు, పాలకులు ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పూర్వం రద్దు చేసిన బస్సులతో పాటు నూతన రహదారులకూ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

- బాలు, టి.చెర్లోపల్లి

గ్రామానికి వెళ్లాలన్నా, రావాలన్నా కాలినడకనో, సైకిల్‌పైనో, ఆటోలోనో ప్రయాణించాల్సిందే. రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఆటోవాలాలు మనిషికి రూ. 30 వసూలు చేస్తున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

ఆటోలే దిక్కు

- వెంకటేశ్వర్లు, లేళ్ళపల్లి

గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని అధికారులను చాలా సార్లు కోరాం. నేటికీ అధికారులు, పాలకులూ పట్టించుకోలేదు. ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోలే దిక్కయ్యాయి. ఆటోవాలాలు చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారు.

నిమజ్జన కోలాహలం

వైభవంగా గణనాథులకు పూజలు



తర్లుపాడులో నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహం

తర్లుపాడు, సెప్టెంబరు 11: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదో రోజు నిమజ్జనానికి తరలించారు. తర్లుపాడులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం, యాదవ్ యూత్, రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్వామివారికి ముందుగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లపై వినాయకుని విగ్రహాలకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు గులామ్‌లు చల్లుకుంటూ జై గణేష్ మహరాజ్ అంటూ నినాదాలు చేస్తూ నృత్యం చేశారు. అనంతరం బొడిచర్ల వద్దనున్న గుండ్లకమ్మ వాగులో పలు విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజ్‌కుమార్ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



దోర్నాల నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

ఘనంగా నిమజ్జనం

కొమరోలు : స్థానిక గోపానిపల్లి రోడ్డులోని ప్రగతి జూనియర్ కళాశాలలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గణనాథున్ని ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి చివరిరోజైన బుధవారం సాయంత్రం ఘనంగా నిమజ్జనం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉల్లాసంగా కులమతాలకు అతీతంగా నిమజ్జనోత్సవంలో డప్పులతో కార్యాక్రమంలో పాల్గొన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని విద్యార్థి రూ.13,100లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌లు సందీప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో..

పెద్ద దోర్నాల : పలు గ్రామాల్లో నిమజ్జన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపురం చౌడేశ్వరీ దేవాలయంలో, దోర్నాలలోని సుందరయ్య కాలనీ, వడ్డే వారి వీధిలో, ఐనముక్కల గ్రామం శ్రీ గణపతి దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బోలో గణేశ్ మహారాజ్‌కీ జై అంటూ నినదాలతో నిమజ్జనం చేసేందుకు శ్రీశైలం తరలించారు.

మార్కాపురంలో..

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక ఇందిరా కళాశాలలో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు కళాశాలలో పూజలు నిర్వహించారు. అనంతరం తీన్‌మార్ తప్పెట్లు, కోలాటాలు, వాయిద్యాల నడుమ నిమజ్జనానికి వినాయకున్నితరలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి, జడ్పీటీసీ వెన్నా ఇందిరా , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గిద్దలూరులో నిమజ్జనానికి తరలివెలుతున్న గణనాథుడు

గిద్దలూరులో..



వేలంలో లడ్డూను దక్కించుకున్న విద్యార్థి

గిద్దలూరు టౌన్ : ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణనాథులు బుధవారం అంగరంగ వైభవంగా మేళతాళాల మధ్యన నిమజ్జనానికి తరలివెళ్ళారు.సంజీవరెడ్డినగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్కన గణనాథుని విగ్రహం వద్ద రూ. 1,51,116 రూపాయలకు వేలంలో అబ్బు ఓబయ్య లడ్డూను సొంతం చేసుకున్నారు. అంబవరం గ్రామంలో బొడ్రాయి యూత్ ఏర్పాటు చేసిన లడ్డూను రూ. 83,500 లకు సభ్యులైన బాలవెంకటరెడ్డి, జువ్విల్లబావి వద్ద రూ. 71వేలకు పలుకూరి ఆదినారాయణ, పాత సత్యనారాయణ టాకీస్ వద్ద గణేష్ మండపం వద్ద నిర్వహించిన పాటలో గోగుల శివక్రిష్ణ రూ.70వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి బుధవారం పలు మండపాల వద్దకు వెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతానికి కార్మికుడు మృతి

- మాజీ మంత్రి సురేష్ సోదరుని అపార్ట్‌మెంట్ వద్ద ఘటన

మార్కాపురం, సెప్టెంబరు 11: విద్యుత్‌షాక్‌కు గురై ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈఘటన తర్లుపాడు రోడ్డులోని లక్ష్మీచెన్నకేశవనగర్‌లో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బండారు వెంకటరావు (21) అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు కొనకనమిట్ల మండలం గాజులపాలెం గ్రామానికి చెందిన వెంకటరావు మాజీ మంత్రి ఆదిమూలపు సురేస్ సోదరుడు డాక్టర్ సతీష్ నిర్మిస్తున్న ఆర్ఆర్ అంబరం అపార్ట్‌మెంట్‌లో బేల్దారి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పనులు చేస్తుండగా అడ్డుగా ఉన్న కరెంట్ తీగలను తప్పించే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో వెంకటరావు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై సైదుబాబు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సైదుబాబు



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు

శ్మశాన వాటికను కాపాడాలంటూ మృతదేహంతో రాస్తారోకో

మార్కాపురం, సెప్టెంబరు 11: ఆక్రమణకు గురైన శ్మశాన వాటికను కాపాడాలంటూ మృతదేహంతో రాస్తారోకో నిర్వహించి దళిత నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సంఘటన స్థానిక ఎస్టేట్ వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన పాణ్యం సంగీతరావు అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించాలంటే శ్మశానం కావాల్సివున్నా అది ఆక్రమణకు గురైంది. దీంతో మృతుని బంధువులు, దళిత నాయకులు కలిసి ఒంగోలు- మార్కాపురం రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై సైదుబాబు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు శ్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమంత్, రంగారావు, సుబ్బారావు, అమీర్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నూతన ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

తర్లుపాడు, సెప్టెంబరు 11: తర్లుపాడు ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పి.రాజ్‌కుమార్‌ను మండలంలోని టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తర్లుపాడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల పార్టీ టీడీపీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ జడ్పీటీసీ రావి బాసపతిరెడ్డి, కంచెర్ల కాశయ్య, పి.గోపినాథ్ చౌదరి, బొంబాయి కాశీం, మేకల వెంకట్, గౌతుకట్ల సుబ్బయ్య, కాశీం, రామిరెడ్డి, చలమయ్య, సుబ్బారావులు ఎస్ఐని కలిసిన వారిలో ఉన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

● తీవ్ర గాయాలు



మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 11: పట్టణంలో కోతులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులలో, ఇళ్లలో యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని గొర్లగడ్డకు చెందిన పండ్లు అమ్ముకునే వృద్ధురాలు దొండపాటి నాగమ్మపై బుధవారం కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు ఆమెను జిల్లా ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స చేయించారు.

గాయపడిన వృద్ధురాలు

సారాబట్టీ ధ్వంసం

గిద్దలూరు, సెప్టెంబరు 11 : రాచర్ల మండలం ఆకవీడు సమీప అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నాటుసారా బట్టీని పోలీసులు ధ్వంసం చేశారు. 400 లీటర్ల బెల్లం ఊటను నేలపాలు చేశారు. 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.



బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

తపాలా సేవలను వినియోగించుకోవాలి

గిద్దలూరు, సెప్టెంబరు 11 : గిద్దలూరులోని ప్రధాన పోస్టాఫీసు ఆవరణలో డాక్ చౌపాల్ కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ తపాలాశాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ హెచ్‌ఎం రాంభూపాల్‌రెడ్డి బజారు పోస్టాఫీసు పోస్టుమాస్టర్ జి.శ్రీనివాసరావు, పోస్టాఫీసు ఇన్‌చార్జి అల్లం రవి, పోస్టల్ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా ఎంపిక

గిద్దలూరు, సెప్టెంబరు 11 : గిద్దలూరుకు చెందిన గుమ్మా జాషువా హ్యూమన్ కేర్ - హ్యూమన్ రైటర్స్ ప్రొటక్షన్ వింగ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన ప్రజాస్వామ్య అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గుర్రం జాషువాను ఈ కమిటీ ప్రతినిధులు జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈసందర్భంగా జాషువా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పౌష్టికాహారం ప్రతి ఒక్కరికీ అవసరం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 11: మహిళలు, బాలికలకు పౌష్టికాహారం అవసరం అని ప్రముఖ వైద్యురాలు కనకదుర్గ అన్నారు. స్థానిక 3, 4 అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పోష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సాయిలోహిత్, కార్యకర్తలు గోవిందమ్మ, విజయలక్ష్మి, రజనికుమారి, ఆయాలు సైరాబాను, ఆశా తదితరులు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న పిల్లర్లు!

పదిహేనేళ్ల నుంచి విద్యార్థినులను వెంటాడుతున్న హాస్టల్‌కష్టాలు



విద్యార్థినుల హాస్టల్ భవన నిర్మాణానికి పదిహేనేళ్ల క్రితం వేసిన పిల్లర్లు నేటికీ వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఆనాటి నుంచి నేటి వరకు పాలకులు ఎవరూ దాని గురించి పట్టించుకోలేదు. ముండ్లమూరులో 2009లో ఏపీ మోడల్ స్కూల్‌ను నిర్మించారు. దానికి అనుసంధానంగా విద్యార్థులకు వసతి కోసం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.50 కోట్లను హాస్టల్ భవనానికి మంజూరు చేసింది. టెండరు పొందిన కాంట్రాక్టర్ 2009 డిసెంబరులో పిల్లర్లు వేశారు. ఆ తర్వాత పత్తా లేకుండా పోయారు. పదిహేనేళ్ల నుంచి పిల్లర్లకే పరిమితమై పోయింది. పాఠశాలకు వచ్చే ఆరు వందల మంది విద్యార్థులకు హాస్టల్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇళ్ల నుంచే ఉదయం ఆటోల్లో వచ్చి సాయంత్రం వరకు చదువుకొని వెళుతున్నారు. వీరిలో ఎక్కువగా మారెళ్ల, ఈదర, భీమవరం, సుంకరవారిపాలెం, వేములబండ, రమణారెడ్డిపాలెం, కెల్లంపల్లి, పులిపాడు, శంకరాపురం, పోలవరం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల విద్యార్థులు ఉన్నారు. బాలికలకు హాస్టల్‌లో ఉంటే స్థానికంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. హాస్టల్ భవనం లేకపోవటం వల్ల సాయంత్రం తిరిగి వారి ఇళ్లకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. -ముండ్లమూరు

తరలిపోతున్న గ్రావెల్



కనిగిరి పట్టణ పరిధిలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దచెరువును కొందరు అక్రమార్కులు గుల్లచేస్తున్నారు. మట్టి వ్యాపారం చేసేందుకు రాత్రిళ్లు జనం సద్దుమణిగాకా అక్రమార్కులు ట్రాక్టర్లతో చెరువు నుంచి మట్టి తరలించుకుపోతున్నా పట్టించుకునే అధికారి లేరు. మొదట్లో 200 ఎకరాలలో ఉన్న చెరువు కాలక్రమంలో ఆక్రమణకు గురైంది. ఈ చెరువు నుంచి వందలాది ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. గత ప్రభుత్వంలో పెద్ద ముఠాగా ఏర్పడి ట్రక్కులకు ట్రక్కులు మట్టి తరలించినట్లే ఇప్పుడూ సాగిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని ప్రజలు కోరుతున్నారు. -కనిగిరి

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి



ట్రాక్ పక్కన ఉదయ కిరణ్

కురిచేడు, సెప్టెంబరు 11 : మండలం వెంగాయపాలెం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా దర్రైపాడు మండలం గోగిదిన్నె గ్రామానికి చెందిన పెద్దిబోయిన ఉదయ్ కిరణ్ (18) గుంటూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అతడు నంద్యాల నుంచి గుంటూరుకు రైలులో బయలుదేరాడు. గుంటూరు- గుంతకల్ రైలు మార్గంలో కురిచేడు సమీపంలో 104/4 కిలోమటరు సమీపంలో ఉదయ్‌కిరణ్ రైలు నుంచి జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలవడంతోపాటు రైల్వే ట్రాక్ పక్కనే గడ్డితో ఉన్న గుంతలో పడిపోయాడు. బుధవారం ఉదయం ఆ దారిని వెళ్లే వారు గమనించి అతడిని ట్రాక్టర్‌లో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కిరణ్ మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం

పామూరు, సెప్టెంబరు 11 :మినీ టెంపో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని సీఐ భీమానాయక్ తన సిబ్బందితో మాటు వేసి పట్టుకొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వాహనంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలివెళ్తున్నాయన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. మినీ టెంపో వాహనాన్ని, అందులోని 60 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

ముండ్లమూరు, సెప్టెంబరు 11 : మండలంలోని ఈదర గ్రామానికి చెందిన నాగమల్లి చంద్రకళ అనే మహిళ, ఆమె ఇద్దరు పిల్లలు ఈ నెల 5వ తేదీ నుంచి కన్పించడం లేదని ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో భర్త కొండ గురవయ్య ఫిర్యాదు చేయగా ఎస్ఐ వై నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రశాంతంగా దేకనకొండ

కురిచేడు, సెప్టెంబరు 11 : కురిచేడు మండలం దేకొండ గ్రామంలో రెండు రోజుల నుంచి వినాయక నిమజ్జనం సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణ సద్దుమణిగింది. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్న ఇరు వర్గాలు పోలీసుల పహారా మధ్య ప్రశాంతంగా ఉన్నారు. ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తెలుగుదేశం పార్టీ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన 27 మందిపై, వైసీపీ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిడిపికి చెందిన 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలియజేశారు.

'గుంటిగంగ' హుండీ ఆదాయం రూ.4.80లక్షలు

తాళ్లూరు, సెప్టెంబరు 11 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ దేవస్థాన హుండీ ఆదాయం 4లక్షల 80వేల 505 రూపాయలు వచ్చినట్లు దేవదాయశాఖ ఈవో కార్తిక్ చెప్పారు. గత నాలుగు నెలల పద్నాలుగు రోజులకు సంబంధించి హుండీలో భక్తులు వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో పి.కార్తిక్, గుంటిగంగ దేవస్థానం చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, కమిటీ సభ్యులు కోటేశ్వరమ్మ, తిరుమలశెట్టి సత్యవతి, మాచవరపురమణ పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు

రూ.47.16 లక్షలు అందజేత



విరాళం చెక్కును సీఎంకు అందజేస్తున్న లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు రూ.47.16200 లక్షల చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, దాతలు అందించిన విరాళం రూ.37,16200 లక్షలు, డాక్టర్ లక్ష్మి దంపతులు రూ.10 లక్షలు కలిపి సీఎంకు అందించారు. ఈ సందర్భంగా తుపాన్ బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరించినందుకు సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చియ్య, ముండ్లమూరు, దొనకొండ, తాళ్లూరు, కురిచేడు మండలాల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, నాగులపాటి శివకోటేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, నెమలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ1,22,700 విరాళం

తాళ్లూరు, సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తూర్పుగంగవరం గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య బుధవారం దర్శిలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు అందజేశారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సూచనతో గ్రామ టీడీపీ కమిటీ గ్రామంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.1,22,700లను టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ద్వారా సీఎం సహాయనిధికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామటీడీపీ ఎస్సీ సెల్ నేత చాట్లడానీ పాల్గొన్నారు.



జనసేన ఆధ్వర్యంలో దుస్తుల అందజేత



వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న పాపారావు

దర్శి, సెప్టెంబరు 11 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో తుపాన్ బాధితులకు నియోజకవర్గ నాయకులు కొనుగోలు చేసిన వివిధ రకాల 1600 వస్త్రాలను విజయవాడకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు దుస్తుల వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 1000 చీరలు, 200 పంజాబీ డ్రస్సులు, 200 దుప్పట్లు, 180 షర్టులు సమకూర్చి విజయవాడ పంపినట్లు జనసేన నాయకుడు కుప్పాల పాపారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ నాయకులు సంగా తిరుపతిరావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు చిన్నా, జనసేన నాయకులు కోటి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మోపాడు రిజర్వాయర్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ఇరిగేషన్ ఎస్ఈకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణ

పామూరు, సెప్టెంబరు 11 : మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో పెరుగుతున్న చేపలను పట్టుకొనేందుకు కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా నీటిని అక్రమంగా వదలటం వలన దళితుల భూములు కోతకు గురవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఇరిగేషన్ శాఖ జిల్లా ఎస్ఈని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నీటిని వదటం వలన కంభాలదిన్నె వద్ద మెయిన్ కెనాల్‌కు గండిపడి ఆయకట్టు భూములు కోతకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారిత చెరువు అయిన మోపాడు రిజర్వాయర్‌కు నీరు చేరడం అంతంత మాత్రమేనన్నారు. చెరువులో చేపలను పట్టుకొనేందుకు కాంట్రక్టర్ నీటిని తూము ద్వారా వదలి కంభాలదిన్నె, లక్ష్మీనరసాపురం వద్ద కాలువకు గండి కొట్టి చెరువుకు ఉత్తరం వైపు కిలోమీటర్ మేర ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీసి పొలాల వైపు నీళ్లను మళ్లించడం వల్ల భూముల్లో నీరు నిలబడి కోతకు గురవుతున్నాయని వివరించారు. ఈదేమని ప్రశ్నించిన రైతులను అంతా డిపార్ట్‌మెంట్ వారే చేశారని, అభ్యంతరాలుంటే వారినే అడగాలని మాట్లాడుతున్నారని తెలిపారు. ఎస్ఈని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే వెంకట్రావు, కే వీరారెడ్డి లు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై విద్యార్థులకు క్విజ్ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

పామూరు, సెప్టెంబరు 11 : బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా ఆకు కూరలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకొంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంతో ఉంటాడని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ చెప్పారు. బొట్లగూడూరు సెక్టార్ పరిధిలోని కోడిగుంపల గ్రామంలో పోషణ మాహాస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంపై క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పునుగుపాటి చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్ లావణ్య, ఎంఎస్‌కే వాణి, ఆరోగ్య కార్యకర్త ధనమ్మ, ఆశా కార్యకర్త మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, వాణీకుమారి పాల్గొన్నారు.

పెదఅలవలపాడులో...

వీసీపల్లి, సెప్టెంబరు 11 : చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ పెదఅలవలపాడు సెక్టార్ పర్యవేక్షకురాలు జరీనా చెప్పారు. మండలంలోని నేరేడుపల్లి2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నరాల వెంకటరమణ, ఆశీర్వాదం, నాగరత్నమ్మ, సింగమ్మ, ఏఎన్ఎమ్ సుమతి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పోషకాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్ సుభాషిణి

దొనకొండ, సెప్టెంబరు 11 : చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, పెసలు, అలసందలు, శనగలు, బొబ్బర్లు తదితర చిరుధాన్యాలతో వంటకాలను చేసుకొని తినటం వలన సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ రమాదేవి, శ్యామలాదేవి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు



పీసీపల్లి : వినాయకుని లడ్డూను సొంతం చేసుకుని తీసుకెళ్తున్న నవీన్



పామూరులో నిమజ్జనానికి తరలిపోతున్న గణనాథులు

పామూరు, సెప్టెంబరు 10 : వినాయక చవితి వేడుకల్లో భాగంగా పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో బుధవారం ప్రత్యేక పూజ లు జరిగాయి. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావులు మండలంలోని తూర్పుకట్టకిందపల్లి, చిలకపాడు, పడమటకట్టకిందపల్లి, పామూరు తూర్పువీధి, విద్యుత్ సబ్‌స్టేషన్ కాలని, ఇనిమెర్ల ఎస్సీ కాలని, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకున్నారు.

రాత్రి తొమ్మిది గంటల వరకు నిమజ్జనం

రాత్రి 9 గంటల వరకు స్థానిక పాత చెరువు వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నిమజ్జనం కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం భీమానాయక్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయగా పామూరు, సీఎస్‌పురం ఎస్ఐలు వెంకట రమేష్, ప్రేమ్‌కుమార్‌లు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



తాళ్ళూరులో నిమజ్జనానికి...



హోమం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

పామూరు వాసవి మాత దేవస్థానంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహాగణపతి, లక్ష్మీ గణపతి, మృత్యుంజయ హోమాలు, మహా పూర్ణాహుతి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాలకొండలు దంపతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి

గణనాథుల నిమజ్జనం సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సీఐ భీమానాయక్ సూచించారు. పట్టణంలోని పలు మండపాల వద్ద సీఐ తన సిబ్బందితో పర్యవేక్షించి కమిటి నిర్వాహకులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో వృద్ధులు, పిల్లలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు.

తాళ్లూరు మండలంలో...

తాళ్లూరు సెప్టెంబరు 11 : మండలంలోని తాళ్లూరులో 1, తూర్పుగంగవరంలో 2, శివరాంపురంలో 1, బొద్దికూరపాడులో1, వెలుగువారిపాలెంలో 1 కలిపి మొత్తం 6 వినాయక విగ్రహాలను నిమజ్జనానికి వైభవంగా తరలించారు. ఆయా గ్రామాల్లో స్వామిని ఊరేగించి సమీపానగల దోర్నపు వాగు, గుండ్లకమ్మ తదితర వాగుల్లో నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎస్సై ఎస్. మల్లికార్జునరావు నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ముండ్లమూరు మండలంలో...

ముండ్లమూరు, సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. జమ్మలమడకలో విగ్రహ దాత బుచ్చి రామారావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనానికి తరలించారు. నూజెండ్లపల్లి, ఉమామహేశ్వర అగ్రహారం, మారెళ్ల, తూర్పుకంభంపాడు, ఈదర గ్రామాల్లో విఘ్నేశ్వరుడిని నిమజ్జనానికి తరలించారు. మారెళ్లలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జబర్దస్త్ అప్పారావు కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది.

పీసీపల్లిలో...

పీసీపల్లి, సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం సందడి నెలకొంది. తలకొండపాడు, బుడ్డారెడ్డి పల్లి, గుంటుపల్లి తదితర గ్రామాల్లోని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ముందుగా ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కమిటీసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాధులను ట్రాక్టర్‌పై గ్రామోత్సవం చేశారు.

రూ.40వేలు పలికిన లడ్డూ పాట

తలకొండపాడు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద లడ్డూను నెలకుర్తి నవీన్ 40,116 రూపాయలకు వేలంలో సొంతం చేసుకున్నారు. వినాయకుని మెడలో వేసిన 15వేల రూపాయల విలువ గలిగిన కరెన్సీ నోట్ల దండను వేలంపాటలో నెలకుర్తి మాధవ్ 50,116రూపాయలకు దక్కించుకున్నాడు. హుండీకి వేలం నిర్వహించగా చెన్నుపాటి మోహన్‌రావు 17వేలకు పాడి స్వంతం చేసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.




కనగాల వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నష్టపోయాం.. న్యాయం చేయండి


ఫొటో ప్రదర్శనను పరిశీలిసున్న కేంద్ర బృంద సభ్యులకు నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి

- కేంద్ర బృందానికి బాధితుల వినతులు
- వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన
- పీపీటీ ద్వారా నష్టం అంచనాలను వివరించిన అధికారులు
- వాణిజ్య పంటలకు చేసిన ఖర్చు గురించి ఆరా తీసిన సభ్యులు
- డ్వాక్రా, పంట రుణాలు రద్దు చేయాలని కోరిన చింతల్లంక మహిళలు

వేమూరు, కొల్లూరు, రేపల్లె / బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరద ఊడ్చేసింది. ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో మిగిలాం. ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. అన్యాయమయ్యాము. ముంపుతో సర్వస్వం కోల్పోయాం. మీరే మమ్మల్ని ఆదుకోవాలి.. పూర్తిగా నష్టపోయాం.. న్యాయం చేయండి.. అంటూ కేంద్ర బృందానికి వరద బాధితులు గోడువెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ విభాగానికి చెందిన డైరెక్టర్ వాఘ్‌మేర్, ఆర్థిక శాఖ కన్సల్టెంట్ కౌల్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. షెడ్యూల్ ప్రకారం రావాల్సిన కేంద్ర బృందం రెండు గంటలు ఆలస్యంగా వేమూరుకు చేరుకుంది. వేమూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన జిల్లా యంత్రాంగంతో కేంద్రబృందం సమీక్షించింది. వరదల వల్ల వివిధ విభాగాలకు జరిగిన నష్టాన్ని పీపీటీ ద్వారా కేంద్ర బృందానికి ఆయా శాఖల అధికారులు వివరించారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రాంతాల వారీగా కేంద్ర బృందానికి కలెక్టర్ ప్రత్యేకంగా నివేదించారు. సమీక్ష అనంతరం బృందంలోని అధికారులు సుగ్గుల్లంక, పెసర్లంకలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. వాణిజ్య పంటలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఓలేరు పల్లెపాలెం, రావి అనంతవరం కరకట్టలను పరిశీలించారు. పంటలకు వరదలు మిగిల్చిన నష్టాన్ని కేంద్ర బృందానికి రైతులు వివరించారు. సుగ్గుల్లంకలో వాణిజ్య పంటలకు జరిగిన నష్టంపై రైతులను వివరాలు అడగగా ఒక్క రూపాయి చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోయారు. అరటితోటను చూపించి తోటంతా రంగుమారిపోయిందని మొత్తం నష్టపోయినట్లేనని రైతులు వివరించారు. పసుపు, గుమ్మడి రైతుల నుంచి కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కనగాల దగ్గర ముంపులో ఉన్న వరి పొలాన్ని బృందం పరిశీలించింది. గత ఐదేళ్లలో కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణమని రైతులు తెలిపారు. సమీపంలోనే జాతీయ రహదారి ఉండడం కూడా ముంపునకు కారణమని, కల్వర్టుల నిర్మాణంపై ఆలోచన చేయాలని కేంద్ర బృందానికి రైతులు నివేదించారు.

కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు..

చింతల్లంక, పెదల్లంక గ్రామంలోని మహిళలు కేంద్ర బృందం కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను అభ్యర్థించారు. వరదలతో సర్వస్వం కోల్పోయామని డ్వాక్రా రుణాలతో పాటు పంట రుణాల విషయంలో తమకు కొంత వెసులుబాటు


చింతల్లంకలో డ్వాక్రా, పంట రుణాలను రద్దు చేయాలని కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులను అడుగుతున్న మహిళలు

ఇవ్వాలని కేంద్ర బృందాన్ని కోరారు. బ్యాంకర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహిళలు కాన్వాయ్‌కు దారిచ్చారు. చింతల్లంకలో ఓ ఇంటిలోకి వెళ్లి దెబ్బతిన్న గోడలను పరిశీలించడంతో పాటు నష్టంపై యజమానులను అధికారులు ప్రశ్నించారు. పెసర్లంకలో ముంపుతో దెబ్బతిన్న ఓ ఇంటిని పరిశీలించి వివరాలను కేంద్ర బృందం నమోదు చేసుకుంది. చెరుకుపల్లి మండలం కనగాలలో పదిరోజులుగా నీటిలో నానుతున్న వరి పొలాలను చూసి కేంద్రబృందం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఇన్ని వేల ఎకరాలు పంట నష్టపోవటం కనుచూపుమేర నీరు తప్ప పొలం కనిపించకపోవడంతో ఎంత నష్టం వాటిల్లిందని కలెక్టర్‌ను ప్రశ్నించింది. ఇన్నిరోజులుగా పొలాలు నీటిలో నానడం ఏమిటని, దీనిపై ఏమి చర్యలు తీసుకోలేదా డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని నాట్లు వేసి 20 రోజులు అవుతుందని 10 రోజులుగా నీటిలోనే నానుతున్నాయని, ఆదుకోకుంటే అప్పుల పాలవ్వుతామని రైతులు తెలిపారు.

కరకట్ట పరిశీలన..

భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంతో పాటు రేపల్లె మండలం రావి అనంతవరం కరకట్టలను, అరవింద వారధిని కేంద్ర బృందం పరిశీలించింది. కరకట్టకు వచ్చిన వరద ఉధృతి పరిస్థితులను ఫొటోలతో కేంద్రబృందానికి కృష్ణారివర్ అధికారులు వివరించారు. వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీసింది. వరదలు ఉధృతంగా ఉన్న సమయంలో బలహీనంగా ఉన్న కరకట్టల వల్ల బిక్కుబిక్కుమంటూ ఎలా కాలం వెళ్లదీశామో ప్రభావిత ప్రాంతాల ప్రజలు బృందసభ్యులకు వివరించారు. వరదలు వచ్చినప్పుడల్లా తీరప్రాంతంలో కోట్లాదిరూపాయలు నష్టం వాటిల్లుతుందంటూ తెలిపారు. కరకట్టల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వివరించగా వారు నివేదికలో పొందుపరుచుకున్నారు. కరకట్టను బలపరిచే విధంగా తగినన్ని నిధులు మంజూరు చేయిస్తే తీరప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని వెంకటమురళి చెప్పారు. నీటమునిగిన రావిఅనంతవరం గ్రామాన్ని కూడా కేంద్ర బృందంలోని అధికారులు పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంకటమురళితో పాటు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్ల నష్టం

విభాగాల వారీగా వివరాలు ఇచ్చిన అధికారులు

వరదల ధాటికి జిల్లాలో జరిగిన నష్టానికి సంబంధించి విభాగాల వారీగా అంచనాలను అధికారులు కేంద్ర బృందానికి సమర్పించారు. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.583 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. 32,771 మంది రైతులకు సంబంధించి 86,659 ఎకరాలు దెబ్బతినగా, 8,468 మంది రైతులకు చెందిన 11,537 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. గృహాలకు సంబంధించి 7,943 నీట మునిగాయని వీటికి వాటిల్లిన నష్టం రూ.9.52 కోట్లుగా అంచనా వేశారు. 202 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారులు దెబ్బతినగా 96.23 కోట్ల నష్టం వాటిల్లిగా, 191 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రమయ్యాయని శాశ్వత నిర్మాణం కోసం రూ.382.54 కోట్లు ఖర్చు కాగలదని నివేదికలో పొందుపర్చారు. విద్యుత్ శాఖకు రూ.1.17 కోట్లు, ఆక్వా రంగానికి రూ.10.17 కోట్లు, పాఠశాల భవనాలకు రూ.3.83 కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి అందించిన నివేదికలో పేర్కొన్నారు. వరదల ధాటికి 24 లంకగ్రామాల్లోని 30,000 మంది ప్రజలు బాధితులుగా మారారని చెప్పారు.


చెరుకుపల్లి : కనగాల సమీపంలో మునిగిన వరి పొలాల మ్యాప్‌ను కేంద్ర బృందంకు వివరిస్తున్న కలెక్టర్

నేడు గుంటూరు జిల్లాలో..

గుంటూరు(ఆంధ్రజ్యోతి): కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం గురువారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వాగ్‌మరే(నాగ్‌పూర్), ఆర్థిక శాఖ కన్సల్‌టెంట్ కౌల్(ఢిల్లీ), గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రెటరి ప్రదీప్‌కుమార్(ఢిల్లీ)లో కూడిన త్రిసభ్య బృందం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనుంది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర బృందానికి ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నష్టాన్ని వివరిస్తారు. అనంతరం పెదకాకాని పరిధిలోని గుంటూరు ఛానల్‌కు పడిన గండ్లను బృంద సభ్యులు పరిశీలిస్తారు. వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లపాలెంలో దెబ్బతిన్న పంటలు, మంగళగిరిలో దింపుడుకళ్లం చేనేతల ప్రాంతంలో నీటమునిగిన మగ్గాలను పరిశీలిస్తారు. తాడేపల్లి మండలం మహానాడులో, తుళ్లూరు మండలం వెంకటపాలెంలో వరద బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. కాగా గతంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర బృందాలు వెంటనే వచ్చేవి కాదు. నెల తర్వాత వచ్చి పరిశీలించేవి. అప్పుడు క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని అంతగా చూపెట్టలేకపోయేవారు. అయితే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం విపత్తు సంభవించిన 10 రోజుల్లోనే కేంద్ర బృందాన్ని పంపించింది. నేటికీ పెదకాకానితో పాటు అనేక మండలాల్లో పంట పొలాలు వరదనీటిలో మునిగే ఉన్నాయి. వాటిని చూపించడం ద్వారా వరద తీవ్రతని కేంద్ర బృందానికి నివేదిస్తామని అధికారవర్గాలు తెలిపాయి.



సమీక్షలో ఆయా శాఖల అధికారులను ప్రశ్నిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

లైసెన్సు లేకుండానే.. వ్యాపారాలు

- మిర్చియార్డులో అక్రమాలను గుర్తించిన విజిలెన్స్
- ప్రత్యక్ష విచారణలో వ్యాపారులు, వేమన్ల వాంగ్మూలాల నమోదు
- అక్రమాలను నేటి డీజీ సమావేశంలో నివేదించే అవకాశం


యార్డులో స్పాట్ ఎంక్వయిరీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లైసెన్సులు లేకుండానే వ్యాపారం.. శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూళ్లు.. ఒక్కో ప్లాట్‌ఫాంపై రెండు బోర్డులు.. ఇలా గుంటూరు మిర్చియార్డులో అనేక అక్రమాలను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే వేల సంఖ్యలో ఫైళ్లను తీసుకెళ్లిన అధికారులు బుధవారం ఉదయం 6 గంటలకే యార్డుకు చేరుకుని దిగుమతి వ్యాపారులు, వేమన్లు, సూపర్‌వైజర్లను ప్రత్యక్షంగా విచారించారు. ఈ విచారణలో భాగంగా అనేక అక్రమాలను గుర్తించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ బృందం స్పాట్ ఎంక్వయిరీ నిర్వహించింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు గత నెలలో విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు చేసిన ఫిర్యాదు ఆధారంగా స్థానిక అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే యార్డు అధికారులతో మాట్లాడి అవసరమైన ఫైళ్లను కలెక్టరేట్ ప్రాంగణంలోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లి పరిశీలిస్తున్నారు. తాజాగా బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దారు కే నాగమల్లేశ్వరరావులతో కూడిన బృందం యార్డుకు చేరుకుని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని అన్‌సీజన్‌లో విక్రయానికి తీసుకొస్తున్న శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నారని గుర్తించారు. రూ.లక్షల్లో అక్రమంగా వసూలు చేశారని నిర్ధారించుకున్నారు. మరోవైపు ఒక్కో కమిషన్ వ్యాపారికి కేటాయించే ప్లాట్‌ఫాంకు రెండు, మూడు ఫరంల బోర్డులుండటాన్ని గమనించారు. దీనిపై ఆరా తీయగా కొంతమంది లైసెన్సు కలిగిన కమీషన్ ఏజంట్లు వ్యాపారం చేయకుండా లీజుకు ఇచ్చి ఏటా రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తేలింది. అక్కడే ఉన్న వేమన్లను కూడా విచారించారు. కాటా వేస్తున్న చోట బిడ్డింగ్ బిల్లు, వేమెన్ చీటి పరిశీలించగా షాపు పేరుకు, చీటీలో నమోదు చేసిన పేరుకు పొంతన లేదు. లైసెన్సులు లేకుండా సుమారు 60 మంది వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

లైసెన్సుల రెన్యువల్‌లో అక్రమాల గుర్తింపు

2022లో ప్రభుత్వం జీవో 85ని తీసుకొచ్చి ఒక్కో కమీషన్ వ్యాపారి వద్ద రూ.5 లక్షల డిపాజిట్ చెల్లించుకుని లైసెన్సులు రెన్యువల్ చేయాల్సిందిగా ఆదేశించింది. అయితే ఏ కొద్దిమందో డిపాజిట్‌లు చెల్లించారు తప్ప మిగతా వారంతా హైకోర్టులో స్టే తెచ్చుకున్నారు. వీరందరి లైసెన్సులు రెన్యువల్ చేయడానికి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు కొంతమంది విజిలెన్స్ అధికారులకు ఉప్పందించారు. మరోవైపు మార్కెటింగ్ కమిషనర్ 64 ఫరంలకు సంబంధించి పార్టనర్‌షిప్ మార్పులను అనుమతించగా దానిని అడ్డం పెట్టుకుని అప్పటి పాలకులు 184 పార్టనర్‌షిప్‌లను మార్పు చేసేసి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల్లో అనధికారికంగా వసూలు చేసి వెనకేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు కొన్ని ఆధారాలను సేకరించారు. అలానే ఈ ఏడాది ఫిబ్రవరిలో మిర్చి యార్డులో గేట్ ఎంట్రీ అయిన సరుకుకు, కాటాలు జరిగిన టిక్కీలకు పొంతన లేకుండా ఉన్నట్లు తేలింది. దాదాపుగా 50 శాతం టిక్కీలు గల్లంతయ్యాయి. దీనిని బట్టి జీరో బిజినెస్ పెద్దఎత్తున జరిగినట్లు అనుమా నిస్తున్నారు. ఎంత సరుకు అయితే జీరోలో వెళ్లిందో దాని రూపంలో మార్కెటింగ్‌కు 1 శాతం మార్కెట్ ఫీజు, వాణిజ్య పన్నుల శాఖకు 5 శాతం జీఎస్‌టీ నష్టం వాటిల్లింది. దీనంత టిపై సమగ్ర నివేదిక ని ప్రభుత్వానికి అందజేసేందుకు విజిలెన్స్ అధికారులు ఫైలు సిద్ధం చేస్తున్నారు. గురువారం విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశంలో మిర్చియార్డు విచారణను కూడా నివేదించే అవకాశం ఉన్నది.


వివరాలు సేకరిస్తున్న నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అయ్యో.. అరటి

- వరదలతో దెబ్బతిన్న తోటలు
- చెట్లపైనే పండి పోతున్న గెలలు
- రూ.1300 నుంచి రూ.600కు పడిపోయిన ధర

కొల్లిపర, సెప్టెంబరు 11: ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌లో ప్రస్తుతం అరటి గెలలు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. నిన్న మొన్నటి వరకు ఎన్నడూ లేనివిధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోయారు. సామాన్య ప్రజలు కూడా అరటి కాయలను కొనుగోలు చేయాలంటేనే భయపడిపోయారు. అటువంటిది అరటి ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు నిరుత్సాహపడుతున్నారు. వరదలు, వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటంతో తోటల్లోనే అరటి గెలలు పండిపోతున్నాయి. దీనికితోడు కృష్ణానది వరదకు లంకల్లో వేసిన అరటి తోటలు నీటిలో మునిగిపోయి బురద కొట్టుకుపోయాయి. దీంతో రుతువుకు రాకుండానే పండిపోతున్నాయి. రైతులకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. పండిపోతుండటంతో గెలలు నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పడిన గెలలు మార్కెట్‌కు రావడంతో వ్యాపారులు వారికి ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారు. అరటి పంట లేని సమయంలో ఆకాశాన్ని అంటిన ధరలు పంట వచ్చే సమయంలో పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.


పది రోజుల క్రితం వరకు..

పది రోజుల క్రితం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.1000 నుంచి రూ.1350 వరకు, రెండో రకం రూ.700 నుంచి రూ.800 పలికాయి. మూడో రకం కర్పూర గెల రూ.350 నుంచి రూ.400, చక్కెర కేళి మొదటి రకం రూ.350 నుంచి రూ.450 వరకు ధర పలికింది. ఈ ధరలను చూసి రైతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం అరటి గెల ధర రూ.600 నుంచి రూ.500, రెండో రకం రూ.400 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. చక్కెరకేళి రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. రూ.800 నుంచి రూ.500 వరకు ధర తగ్గడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మహానంది, రావుపాలెం, ఏలూరు నుంచి ఎక్కువగా అరటి గెలలు దిగుమతి అయ్యే అవకాశం ఉందని, దీంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.


కొల్లిపర మార్కెట్‌లో గెలలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

డజను రూ.60 నుంచి రూ.80 విక్రయం

మార్కెట్‌లో అరటి గెలకు ధర తక్కువగా ఉన్నా వ్యాపారులు మాత్రం అధిక ధరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరను బట్టి డజను అరటి కాయలు రూ.20 నుంచి రూ.35 మాత్రమే పడుతున్నాయి. అటువంటిది వ్యాపారులు మాత్రం డజను అరటి కాయలను రూ.60 నుంచి రూ.80 వరకు అమ్మిసొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అరటి కాయలను కొనాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. పండించిన రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.


మార్కెట్ రూ.600 పలికిన అరటి గెలలు

పసికందును ఇచ్చేశారు

- తల్లి మృతి.. మరో తల్లి ఆవేదన తీర్చేందుకు..
- అప్పటికే 8 మంది సంతానంతో బిడ్డను ఇచ్చిన తండ్రి


సుబ్రమణ్యం ఇల్లు

చిన గంజాం, సెప్టెంబరు 11: సినీ ఫక్కీలో జరిగిన ఓ శిశువు వ్యవహారం కలకలం రేపింది. ఈ ఘటనపై గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా చినగంజాంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. చినగంజాం పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రమణ్యం భార్య లక్ష్మి చీరాల వైద్యశాలలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. భట్టిప్రోలుకు చెందిన మీరాబి అనే గర్భిణి గత నెలాఖారున జీజీహెచ్‌లో ప్రసవించగా శిశువు మృతి చెందింది. దీంతో మానసిక వేదనతో మీరాబి ఆరోగ్యం క్షీణించింది. జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్న మీరాబిని చూసుకునేందుకు భట్టిప్రోలుకు చెందిన ఆమె స్నేహితురాలు ప్రభావతి.. మీరాబి ప్రసవానికి ముందు నుంచే తోడుగా ఉంటుంది. బిడ్డను కోల్పోయిన మీరాబి బాధను ప్రభావతి చూడలేకపోయింది. అదే సమయంలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నగంజాంకు చెందిన మానికల సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మి ఆడ శిశువుకు జన్మనిచ్చిన తర్వాత కన్నుమూసింది. సుబ్రహ్మణ్యంకు అప్పటికే 9 మంది సంతానం ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య చనిపోవడం, కొత్తగా పుట్టిన శిశువును పెంచడం వాళ్లకు ఇబ్బందిగా ఉంటుందని భావించిన ప్రభావతి.. ఈ నెల 7న చిన్నగంజాం వచ్చి సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించి వారి శిశువును రూ.లక్షా 90 వేలకు కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఆ శిశువును మీరాబికి ఇచ్చింది. అయితే మీరాబికి పుట్టిన శిశువు చనిపోవడంతో మరో శిశువును తీసుకురావడంపై అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది ప్రభావతిని నిలదీశారు. దీంతో ఆ శిశువును కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు ఆమె ఒప్పుకొంది. సిబ్బంది విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించిన ఆసుపత్రి వర్గాలు శిశువు కొనుగోలు వాస్తవమేనని గుర్తించారు. ఆసుపత్రి ఆర్‌ఎం ఫిర్యాదు మేరకు కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు పంపిన సమాచారం మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు చినగంజాం ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. తల్లి లేని బిడ్డను సాక లేక వారికి ఇచ్చినట్లు సుబ్రమణ్యం బంధువులు తెలిపారు. సుబ్రమణ్యం స్వగ్రామం చినగంజాం అయినప్పటికీ అతడు నాగులుప్పలపాడు మండలం నిడమానూరులో ఉంటున్నాడు.

కట్టెలు కొట్టుకుంటూ పోషణ



కట్టెలు, చేపలు అమ్మగా వచ్చిన సంపాదనతో ఎనిమిది మంది పిల్లలను పోషించుకుంటున్నాం. బిడ్డ చనిపోయి బాధనడుతున్న మరో తల్లికి బిడ్డ లేని లోపం లేకుండా చేసేందుకు ఇచ్చాం. బిడ్డను అమ్ముకోలేదు. పెంచుకునేందుకు ఇచ్చాం. అక్కడైనా బిడ్డ సుఖంగా ఉంటుందని ఇచ్చాం.

- చేవూరి శ్రీలక్ష్మి, సుబ్రమణ్యం చెల్లి

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం



ఇసుక తవ్వే ప్రదేశంలో తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 11 : మండల పరిధిలోని పందిళ్లపల్లి సర్వే నెంబరు 102బై1 సొన పోరంబోకులో ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. వాటిని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రావాణాకు సంబంధించి ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

14న జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

మేదరమెట్ల, సెప్టెంబరు 11 : ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 14వ తేదీన ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని వీడీ సీఈ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రావినూతలలోని క్రికెట్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఉ మ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జట్టు ఎంపిక వాయిదా పడిందన్నారు. ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో జరుగుతాయని నాగేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు అక్టోబరు 1వ తేదీ నుంచి కడప, అనంతపురంలో జరిగే ఆంధ్ర క్రికెట్ ఆధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూష్, సొంత కిట్‌తో పాటు జనన ధ్రువీకరణ పత్రం (ఫారం-5), ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. బాలుర అండర్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 1-9-2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం కోచ్ సుధాకర్, బి.చంద్రశేఖరం మొబైల్ నెంబర్లు 9701088333, 9246222999కు ఫోన్ చేసి సంప్రదించాలని నాగేశ్వరావు తెలిపారు.

గాయపడిన ఉపాధ్యాయుడు మృతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఒంగోలు సమపంలోని ముక్తినూతలపాడుకు చెందిన జి.అచ్యుత్‌కుమార్ (50) రెండు సంవత్సరాలుగా అద్దంకి మండలంలోని కుంకుపాడు గ్రామం లో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 6వ తేదీన ఒంగోలు నుంచి కుంకుపాడు పాఠశాలకు బైక్‌పై వస్తూ మోదేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన అచ్యుత్‌కుమార్‌ను మోదేపల్లి, అద్దంకి సీహెచ్‌సీ వైద్యశాలలో చికిత్స అనంతరం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన్ని విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో బంధువులు బుధవారం సాయంత్రం అక్కడకు తీసుకువెళ్లగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అచ్యుత్‌కుమార్ మృతి పట్ల సీఆర్పీ రమేష్, ఏపీటీఎఫ్ అద్దంకి మండల శాఖ సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో నివాసముంటున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. లక్ష్మీనారాయణ (26) పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో ఒంటరిగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు విజయవాడలో ఉంటుండగా లక్ష్మీనారాయణ ఇక్కడి టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. సొంతంగా వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో అతను కొద్ది రోజులుగా టీస్టాల్‌లో పనికి కూడా వెళ్లడం లేదని తెలిసింది. బుధవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఖాదర్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జీజీహెచ్‌లో భార్య డ్యూటీ చేస్తున్న భర్త



భార్య స్థానంలో డ్యూటీ చేస్తున్న డాక్టర్ బాషా

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 11: ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్యం విడ్డూరంగా మారింది. విధుల్లో ఉండాల్సిన మహిళా డాక్టర్ స్థానంలో ఆమె భర్త విధులు నిర్వర్తిస్తున్నారు. పైపెచ్చు వైద్య కోసం వచ్చిన వారి పట్ల శ్రద్ధ చూపకపోగా, కఠినంగా వ్యవహరించడంపై రోగులు మండిపడుతున్నారు. ఈక్రమంలో బుధవారం చోటుచేసుకున్న ఘటనపై ప్రజాసంఘాలు సూపరింటెండెంట్‌కు డాక్టర్ దుర్గాదేవికి ఫిర్యాదు చేశారు. రిమ్స్ క్యాజువాలిటీలో మధ్యాహ్నం డ్యూటీ చేయాల్సిన డాక్టర్ నజ్మా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తుండగా, ఆమె భర్త డాక్టర్ బాషా విధులు నిర్వర్తించడం విమర్శలకు తావిస్తోందన్నారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మహిళా డాక్టర్ నజ్మా డ్యూటీని ఆమె భర్త బాషా చేస్తున్న విషయాన్ని గుర్తించానని, ఈ విషయమై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి

కురిచేడు, సెప్టెంబరు 11 : మండలం వెంగాయపాలెం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా దర్రైపాడు మండలం గోగిదిన్నె గ్రామానికి చెందిన పెద్దిబోయిన ఉదయ్‌కిరణ్ (18) గుంటూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అతడు నంద్యాల నుంచి గుంటూరుకు రైలులో బయలుదేరాడు. గుంటూరు- గుంతకల్ రైలు మార్గంలో కురిచేడు సమీపంలో 104/4 కిలోమటరు సమీపంలో ఉదయ్‌కిరణ్ రైలు నుంచి జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలవడంతోపాటు రైల్వే ట్రాక్ పక్కనే గడ్డితో ఉన్న గుంతలో పడిపోయాడు. బుధవారం ఉదయం ఆ దారిని వెళ్లే వారు గమనించి అతడిని ట్రాక్టర్‌లో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కిరణ్ మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు

ముండ్లమూరు, సెప్టెంబరు 11 : మండలంలోని ఈదర గ్రామానికి చెందిన నాగమల్లి చంద్రకళ అనే మహిళ, ఆమె ఇద్దరు పిల్లలు ఈ నెల 5వ తేదీ నుంచి కన్పించడం లేదని ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో భర్త కొండగురవయ్య ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వై నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పామూరు, సెప్టెంబరు 11 :మినీ టెంపో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని సీఐ భీమానాయక్ తన సిబ్బందితో మాటు వేసి పట్టుకొన్న సంఘటన మంగళవా రం రాత్రి చోటుచేసుకుంది. వాహనంలో రేషన్ బియ్యాన్ని అక్రమం గా తరలివెళ్తన్నాయన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది. మినీ టెంపో వాహనాన్ని, అందులోని 60 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

సాగు జోరు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు సాగుచేస్తున్న పత్తి, పొగాకు, కందితో పాటు కూరగాయల పైర్లు కళకళలాడుతున్నాయి. నెలరోజుల క్రితం వర్షాభావంతో కొట్టుమిట్టాడిన రైతన్నలు ఇటీవల కురిసిన వర్షానికి పైర్లు కోలుకోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పశ్చిమ ప్రాంతంలో అధికంగా ప్రస్తుతం పత్తి పంట వేయగా అది ఏపు మీద ఉంది. తూర్పు ప్రాంతంలో శనగ, పొగాకు సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గుండ్లకమ్మతోపాటు, చిన్నచిన్న వాగులు వంకలలో నీళ్లు పారాయి. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులకు నీరు రావడంతో భూగర్భజలాలు పెరిగాయి. రైతన్నలు పైర్లలో కలుపు తీయించుకోవడం, బలం మందు పెట్టుకోవడం వంటి పనులలో నిమగ్నమయ్యారు.

వ్యవసాయ పనులు ముమ్మరం
ఉపకరించిన ఇటీవల వర్షాలు
పశ్చిమాన మిర్చి, పొగాకు నాట్లు ప్రారంభం
నీటి వనరుల కింద వరి నారుమళ్లు
కళకళలాడుతున్న మెట్ట పైర్లు
వారం రోజుల్లో 27వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో పంటల సాగు

-మార్కాపురం మండలంలో 5వేల ఎకరాలకుపైగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షం ముఖ్యంగా పత్తి పైరుకు బలాన్ని చేకూర్చింది. ఏ గ్రామంలో చూసినా పత్తి పైరు కళకళలాడుతోంది. పత్తితోపాటు పొగాకు, మిరప, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని కోలభీమునిపాడు, పెద్దనాగులవరం, తిప్పాయపాలెం గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల చెరువులకు నీళ్లు వచ్చాయి. వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి.

-కొండపి నియోజకవర్గంలో వారంరోజుల క్రితం తేలికపాటి వర్షాలు పడ్డాయి. ప్రస్తుతం ఎండ తీవ్రంగా కాస్తోంది. దీంతో రైతులు పదును చూసుకుని వచ్చేనెలలో పొగాకు, శనగ పైర్లు సాగు చేసుకునేందుకు ప్రస్తుతం దుక్కులు దున్నుకుంటున్నారు. పొలాలను ఆయా పైర్లు వేసేందుకు అనువుగా సిద్ధం చేసుకుంటున్నారు. కాగా తొలకరి వర్షాలకు సాగు చేసిన నువ్వు పంటను కొందరు రైతులు దున్నేసుకోగా, కొందరు ప్రస్తుతం కోసి కుప్పలు పెడుతున్నారు. ఎండిన వాటిని విత్తనాలు రాల్చుకుంటున్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి)/మార్కాపురం రూరల్/కొండపి: జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలు అందుకు ఉపకరించాయి. అప్పటికే వేసి ఉన్న మెట్ట పైర్లు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. కొత్తగా పంటల సాగు జోరందుకుంది. గడిచిన వారం రోజుల్లోనే దాదాపు 27వేల హెక్టార్లలో అదనంగా పంటలు సాగయ్యాయి. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి, పొగాకు నాట్లు ఊపందుకొన్నాయి. నీటి వనరుల కింద అక్కడక్కడా వరినాట్లు వేస్తున్నారు. అలాగే వరి నారుమళ్లను సిద్ధం చేయడంతోపాటు ఇతర మెట్ట పైర్ల సాగుకు రైతులు భూములు సిద్ధం చేస్తున్నారు. ఇలా పొలం పనుల్లో అందరూ బిజీ అయ్యారు.

ఇటీవల వరకు వర్షాభావం..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ముందుకు సాగలేదు. అవసరమైన స్థాయిలో వర్షం లేక ఈ పరిస్థితి ఏర్పడింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్ కాగా ఆ సమయంలో జిల్లాలో 2.02 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తారు. అందులో అత్యధికంగా 73వేల ఎకరాలలో కంది, 31,562 హెక్టార్లలో పత్తి ఉంటుంది. మిగిలిన వాటిలో సజ్జ, నువ్వు, మిర్చి, వరి ప్రధానమైవి. కాగా ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పంటల సాగు ముందుకు కదలేదు. ఆగస్టు ఆఖరు నాటికి సాధారణంగా సుమారు 1.50లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది కేవలం 62,530 హెక్టార్లలో (31శాతం) మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇక ఈ ఏడాది ఖరీఫ్‌కు కరువు కాటు తప్పదన్న ఆందోళన రైతుల్లో కనిపించింది.



పశ్చిమ ప్రకాశంలో సాగు చేస్తున్న రైతు, కూలీలు

రెండు రోజుల్లో 95.మి.మీ సగటు వర్షపాతం

పంటల సాగుపై రైతుల్లో ఆశలు మోడువారుతున్న సమయంలో ఈనెల ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఇంచుమించు 95మి.మీ. సగటు వర్షపాతం జిల్లాలో నమోదైంది. తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్న పశ్చిమప్రాంతంలో భారీ వర్షాలే కురిశాయి. వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది. మరో వైపు సాగుకు సాగర్ నీరు విడుదలైంది. ఈ పరిణామాలు రైతుల్లో మళ్లీ ఆశలను చిగురింపజేశాయి. దీంతో పొలం పనులకు ఉపక్రమించారు. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో మిర్చి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఎర్రనేలల్లో పొగాకు నాట్లు ప్రారంభమయ్యాయి. సాగర్ ఆయకట్టులో వరిసాగుకు నార్లు పోస్తుండగా బోర్ల నీరు అవకాశం ఉన్న ప్రాంతంలో వరినాట్లు కూడా వేస్తున్నారు. అలా గత వారం రోజుల్లో సుమారు 27వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

89,706 హెక్టార్లలో పంటల సాగు

ఈ సీజన్‌లో ఇప్పటివరకూ సుమారు 89,706 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు సమాచారం. ఇంకా మెట్ట పైర్లు వేసేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. తాజా వర్షాలు పొలంలో ఉన్న పైర్లకు బాగా మేలు చేశాయి. ప్రధానంగా వాడుముఖం పట్టిన సజ్జ, కంది, పత్తి, మొక్కజొన్న ఇతరత్రా పైర్లు జీవంపోసుకొని కళకళలాడుతున్నాయి. రానున్న వారంపది రోజుల్లో మరింత విస్తారంగా పంటలు సాగు జరగనుంది.

వైసీపీ నేత దగా



వ్యవసాయ పరికరాల పేరిట దాదాపు రూ.4 కోట్లు వసూళ్లు
ఏడాది నుంచి పూర్తిగా ఇవ్వని వస్తువులు
తాళ్లూరు, ముండ్లమూరు మండలాల రైతుల గగ్గోలు
ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు
విచారణ చేపట్టిన ముండ్లమూరు ఎస్సై

దర్శి, సెప్టెంబరు 11 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు కొంతమంది ప్రజలను ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రూపాల్లో దగా చేసి కోట్లాది రూపాయలు జేబులో వేసుకున్న సంఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి అవినీతి, అక్రమాలకు మోసపోయిన వారు ధైర్యంగా బయటకొచ్చి ఆ మోసాన్ని చెబుతున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.. తాళ్లూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు నాగార్జునరెడ్డి ఐటీసీ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొందరు రైతులకు ఐటీసీ ద్వారా సబ్సిడీపై సగం ధరకు ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు ఇప్పిస్తానని ఊరూరా ప్రచారం చేశాడు. తొలుత కొందరి రైతులు వద్ద డబ్బులు తీసుకొని చెప్పిన ప్రకారం ట్రాక్టర్లు, పనిముట్లు తెచ్చి ఇచ్చాడు. ఒక కంపెనీ ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేసి రైతులకు ఇచ్చి ఐటీసీ సంస్థ ద్వారా తెచ్చానని తెగ ప్రచారం చేశాడు. దీంతో చాలా మంది రైతులు నమ్మి అతనికి డబ్బు ఇచ్చారు.

ఐటీసీ సంస్థ బ్రాండ్‌తో వసూళ్లు ఇలా...

దేశవ్యాప్తంగా ఐటీసీ సంస్థకు మంచి పేరు ఉండటంతో ఆ నమ్మకమే అతను మోసానికి పునాదిగా వాడుకున్నాడు. దీంతో వందలాది మంది రైతులు ట్రాక్టర్లు, పనిముట్ల కోసం నాగార్జునరెడ్డికి డబ్బులు ఇచ్చారు. అప్పుడప్పుడు ఒక్కో ఊరిలో ఒకరికి ట్రాక్టర్, కొన్ని పరికరాలు కొనుగోలు చేసి ఇస్తూ మిగిలిన వారికి ఎరవేశాడు. దీంతో చాలా మంది డబ్బులు కట్టారు. ఆ క్రమంతో సకాలంలో పరికరాలు ఇవ్వకపోవడంతో గట్టిగా అడిగిన వారికి అదిగో వస్తున్నాయ్, ఇదిగో వస్తున్నాయ్ అంటూ వాయిదాలు చెబుతూ వచ్చాడు. ఈ వ్యవహారం గత మూడేళ్ల కాలంలో జోరుగా జరిగింది. కొంత మంది రైతులకు ట్రాక్టర్లు పరికరాలు అందించటంతో మిగిలిన వారు కొద్ది రోజుల తర్వాతైనా వస్తాయన్న ఆశతో ఎదురుచూశారు. డబ్బులు చెల్లించి ఏడాది దాటినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా సాకులు చెబుతున్నాడు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదని మౌనం వహించిన రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కొద్దిరోజుల క్రితం ముండ్లమూరు మండలానికి చెందిన టి. నారాయణరెడ్డి, మరికొందరు రైతులు జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్ డీఎస్పీ లక్ష్మీనారాయణను ఆదేశించారు.

విచారణలో ఒప్పుకున్న నిందితుడు

కొందరు బాధిత రైతులు డీఎస్పీ లక్ష్మీనారాయణను కలిసి వసూళ్ల దందాను వివరించారు. ఆయన వెంటనే ముండ్లమూరు ఎస్సై నాగరాజుకు విచారణ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు రైతులకు ముండ్లమూరు ఎస్సైను కలిసి పరిస్థితిని వివరించారు. ఎస్సై వెంటనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగార్జునరెడ్డిని పిలిపించి మాట్లాడారు. తాను ట్రాక్టర్లు, రొటావేటర్లు, ట్రక్కులు, ఇతర వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై సగం ధరకు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని విచారణలో నాగార్జునరెడ్డి అంగీకరించాడు. తనకు కొంత గడువు ఇస్తే రైతులు వద్ద తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లిస్తానని చెప్పినట్లు సమాచారం. ఇలా సుమారు రూ.4 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అధికారులు తమ సొమ్ము వీలైనంత త్వరగా ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చచ్చినా చావే !

రావిపాడులో శ్మశానానికి వెళ్ళాలంటే గుండ్లకమ్మ దాటాల్సిందే
5 సంవత్సరాల వైసీపీ పాలనలో పట్టించుకోని పాలకులు



వాగు నుంచి శవాన్ని మోసుకుని శ్మశానానికి వెలుతున్న గ్రామస్థులు

కంభం, సెప్టెంబరు 11 : వృద్ధాప్యంతోనో, మరే ఇతర కారణాలతో కాలం చేస్తే ఆ గ్రామస్థులు శ్మశానానికి మృతదేహాన్ని మోసుకెళ్లాలంటే బతికినోళ్ల చావుకు వస్తుందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావిపాడు గ్రామంలో కిలోమీటరు అవతల ఊరికి దూరంగా శ్మశానం ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్యలో గుండ్లకమ్మవాగు ఉంది. ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లాలంటే వేసవి, శీతాకాలంలో ఎలాంటి సమస్య ఉండదు. వర్షాకాలంలో మాత్రం గుండ్లకమ్మ వాగు నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. వాగుపారే సమయంలో ఎవరైనా మరణిస్తే శ్మశానానికి ఎలా వాగుదాటాలా అని ఆందోళన చెందుతుంటారు. నడుముల పైకి పారుతున్న గుండ్లకమ్మ వాగులోకి దిగి భుజంపై పాడెను మోస్తూ జాగ్రత్తగా తీసుకెళ్ళాల్సి వస్తోంది. చివరి చూపు చూసేందుకు బంధువులు, మహిళలు, పిల్లలు వాగు దాటలేని పరిస్థితి. వాగు అవతల ఒక్క శ్మశానమేకాక రైతుల పొలాలు కూడా ఉన్నాయి. వాగు ఉధృతంగా పారే సమయంలో పొలాలకు వెళ్లలేని పరిస్థితి. గ్రామసమస్యను తీర్చాలంటూ గత వైసీపీ పాలనలో నాయకులు, అధికారుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి వాగుపై చప్టాను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు
రూ.47.16 లక్షలు అందజేత



విరాళం చెక్కును సీఎంకు అందజేస్తున్న లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుకు రూ.47.16200 లక్షల చెక్కును అందజేశారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, దాతలు అందించిన విరాళం రూ.37,16200 లక్షలు, డాక్టర్ లక్ష్మి దంపతులు రూ.10 లక్షలు కలిపి సీఎంకు అందించారు. ఈ సందర్భంగా తుఫాన్ బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరించినందుకు సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చియ్య, ముండ్లమూరు, దొనకొండ, తాళ్లూరు, కురిచేడు మండలాల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, నాగులపాటి శివకోటేశ్వరరావు, ఓబుల్‌రెడ్డి, నెమలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ1,22,700 విరాళం

తాళ్లూరు, సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తూర్పుగంగవరం గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య బుధవారం దర్శిలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు అందజేశారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సూచనతో గ్రామ టీడీపీ కమిటీ గ్రామంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.1,22,700లను టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ద్వారా సీఎం సహాయనిధికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామటీడీపీ ఎస్సీ సెల్ నేత చాట్లడానీ పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీ గాడిలో పడేనా

క్రమేపీ రద్దవుతూ వచ్చిన సర్వీసులు
కార్మికులు, అధికారుల మధ్య కొరవడిన ఐక్యత
సిబ్బందిపై పెరిగిన కక్షసాధింపులు
నేడు హైదరాబాద్‌కు పాత బస్సుల స్థానంలో కొత్త సర్వీసులు ప్రారంభించనున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి ఆర్టీసీ డిపో గతంలో ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర స్థాయిలో పలు విభాగాలలో ప్రథమ స్థానం సాధించింది. ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఏటికేడు సర్వీసులు పెరగాల్సింది పోయి క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. దీంతో డిపో పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కార్మికులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడు అద్దంకి డిపో లాభాల బాటలో నడిచింది. సిబ్బంది, ప్రయాణికుల సలహాలకు ప్రాధాన్యత ఇచ్చిన సమయంలో అన్నింటా ముందుంది. కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సఖ్యత లేకపోవడంతో పాటు అధికారుల ఏకపక్ష ధోరణి కారణంగా పలు సందర్భాలలో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడ్డ పరిస్థితులు అనేకం చోటుచేసుకున్నాయని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఓ మహిళా కండక్టర్ విధులు నిర్వహించలేనని, ఒకటిరెండు రోజులు సెలవు ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకుపోగా విధులు నిర్వహించే సమయంలో పడిపోతే మినహా సెలవు ఇవ్వలేమని చెప్పడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఓ డ్రైవర్ ఆరోగ్యం బాగాలేదని సెలవు కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారి వ్యాఖ్యానించిన తీరు కార్మికులందరిలో తీవ్ర కోపాన్ని తెప్పించింది. ఇవి చాలదన్నట్లు తరచూ పలు సర్వీసులు రద్దు చేస్తుండడంతో ఆయా రోజులలో విధులకు హాజరయ్యే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు బలవంతపు సెలవు పెట్టుకోవాల్సిన పరిస్థితి అని పలువురు కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. మిగిలిన ఏ డిపోలో లేని విధంగా అద్దంకి డిపోలో తరచూ ప్రీ ప్లాన్ క్యాన్సిలేషన్ (పీపీసీ) పేరుతో రద్దు చేస్తుండడంతో అటు ప్రయాణికులు, ఇటు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం సుమారు 10కి పైగా బస్ సర్వీసులు రద్దు చేస్తున్నారు. అద్దంకి డిపో లో గతంలో 80కిపైగా బస్సు సర్వీసులు ఉండగా, ప్రస్తుతం 62 సర్వీసులకు తగ్గిపోయాయి.

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నేతలు ఆర్టీసీ గురించి పట్టించుకోకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పలు సర్వీసులు రద్దు అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బల్లికురవ, పంగులూరు మండలాల నేతలు ఆర్టీసీ బస్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అద్దంకి డిపోకు మంత్రి రవికుమార్ రానున్న నేపథ్యంలో అద్దంకి డిపోలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చేందుకు పలువురు కార్మిక సంఘాల నేతలు సిద్ధమవుతున్నారు. మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి అద్దంకి డిపోను గాడిలో పెట్టి గత వైభవాన్ని తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కార్మికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కలిసొచ్చిన కాలం

» నిండుగా చెరువులు
» ముందస్తుగానే సాగుకు సిద్ధమైన అన్నదాతలు

అద్దంకి, సెప్టెంబరు 11 : కాలం కలిసి వచ్చి చెరువులు నిండుగా నిండాయి. వర్షాలకు తోడు సాగర్ కాలువలకు నీరు విడుదల కావడంతో ప్రతి ఏటా అక్టోబరులో నిండే చెరువులు ఈ ఏడాది ఆగస్టు చివరి వారం, సెప్టెంబరు మొదటి వారానికి పూర్తి స్థాయిలో నిండాయి. అద్దంకి నియోజకవర్గంలో పెద్ద చెరువులుగా ఉన్న భవనాసి, సంతమాగులూరు, ఏల్చూరు, కొప్పరం, ఈర్ల చెరువు, అంబడిపూడి, కలవకూరు, ధర్మవరం తదితర చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. దీంతో రైతులు ముందుగానే వరి సాగుకు సిద్ధం అయ్యారు. ముందస్తుగానే నార్లు పోసిన రైతులు ఇప్పటికే వరినాట్లు వేశారు. ముందుగానే నాట్లు వేస్తుండడంతో దీర్ఘకాల వరి వంగడాలు సాగుపై రైతులు దృష్టి పెట్టారు. మరి కొందరు రైతులు ప్రస్తుతం వరి నార్లు పోస్తున్నారు. అటు వర్షాలు సకాలంలో పడడం, ఇటు సాగర్ జలాలు విడుదల కావడంతో పాటు సాగర్ ఆయకట్టులో ఇంకా పూర్తి స్థాయిలో వరి నాట్లు ప్రారంభం కాకపోవడంతో చెరువులకు నీరు చేరి త్వరగా నిండాయి. దీంతో ఆయా చెరువుల ఆయకట్టు రైతులు నీటి కోసం ఎదురు చూసే అవసరం లేకుండా ముందస్తుగానే వరి సాగుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో గుండ్లకమ్మ నదికి నీటి ప్రవాహం రావడంతో ఆయా గ్రామాల వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు కూడా ముందస్తుగానే వరి సాగుకు సిద్ధమవుతున్నారు.


నీటితో కళకళలాడుతున్న భవనాసి చెరువు



నీటితో నిండుగా ఉన్న సంతమాగులూరు చెరువు, చెరువు ఆయకట్టులో వేసిన వరి నాట్లు


ఎంపీడీవోకు డీడీని అందజేస్తున్న రాయల్ స్కూల్ ప్రతినిధులు రవీంద్రబాబు, మధుబాబు

సీఎం సహాయ నిధికి రూ.లక్షా20వేల విరాళం

మార్టూరు, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా మార్టూరులోని రాయల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి స్కూల్ యాజమాన్యం 1లక్షా 20వేల రూపాయలను వసూలు చేశారు. బుధవారం స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పీ రవీంద్ర బాబు, సంస్థ ఇన్‌చార్జి కే మధుబాబు సీఎం సహాయనిధి పేరుతో 1లక్షా20 వేల డీడీని ఎంపీడీవో జీ నితిన్‌కు వారి కార్యాలయంలో అందచేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గో రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

చీరాల, సెప్టెంబరు 11 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో రక్షణ చట్టాల్ని పటిష్టంగా అమలు చేయాలని దైవజ్ఞాన సాధకుడు ఏ.కృష్ణరాజర్షి బుధవారం ప్రకటనలో కోరారు. సనాతన ధర్మం, సర్వజన క్షేమాన్ని కోరే హిందూ ధర్మ శాస్త్రాల సారాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరించాలన్నారు. ధర్మో రక్షతి, రక్షితః అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన ఆవశ్యకతను ఆయన ఆ ప్రకటనలో వివరించారు.


బాలికలతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

క్రమశిక్షణతోనే లక్ష్యాలను చేరుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11 : క్రమశిక్షణతో చదివి మీ లక్ష్యాలను చేరుకోవాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని హైస్కూల్ ప్లస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆడపిల్లలగా చదువు ఆవశ్యకతను గురించి, తద్వారా పొందే ప్రయోజనాలను తెలియజేశారు. మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, నమోదుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో 2 బి.సుధాకరరావు, హెచ్‌ఎంలు పీ గంగాధరరావు, కేవీ శ్రీనివాసరావు, ఊటుకూరి శ్రీనివాసులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బూదవాడ విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, సెప్టెంబరు 11 : మండల స్థాయిలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యా వనరుల కేంద్రంలో బుధవారం వికసిత్ ఏపీ 2047 అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వ్యాస రచనలో బూదవాడ పదవతరగతి విద్యార్థిని షేక్ సమీర ప్రథమ స్థానంలో నిలువగా, కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు చెందిన పవన్ గోపీకృష్ణ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వక్తృత్వ పోటీలో బూదవాడ విద్యార్థి జి.మురళీకృష్ణ సాయిరామ్ ప్రథమ స్థానం, చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లా గాయత్రి ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నాగభూషణం, జి.వీరాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15లోగా ఈ-పంట నమోదు చేయాలి


కుంకుపాడులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: పంటలను సాగు చేస్తున్న రైతులు ఈ నెల 15వ తేదీలోపు ఈ-పంట నమోదును చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కుంకుపాడు గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పంట నమోదైతేనే ఫసల్ బీమా వర్తిస్తుందని, గిట్టుబాటు ధర, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పథకాలు అందుతాయని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఇందిరమ్మ

చిరుధాన్యాలు, ఆకుకూరలు తినాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11: రక్తహీనత రాకుండా చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఇందిరమ్మ అన్నారు. బుధవారం కలవకూరు సెక్టార్ పరిధిలోని శింగరకొండపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, దాని నివారణకు తీసుకోవల్సిన ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాగులు, బెల్లం తీసుకోవడం ద్వారా ఐరన్ వృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలో అందించే పాలు, గుడ్లు, బాల సంజీవని కిట్‌లను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలన్నారు. 3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం, గుడ్లు, పాలు ఇవ్వాలని తద్వారా సంపూర్ణ ఆహారం అంది రక్తహీనతను నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎస్.ఏసమ్మ, ఎంఎల్‌పీహెచ్‌ఎం పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నాగమణి, పి.అల్లూరమ్మ, విశాలాక్షి, రమణ, అచ్చమ్మ పాల్గొన్నారు.

పంగులూరు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని కొరిశపాడు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. మండలంలోని రామకూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని కృష్ణకుమారి తెలిపారు. ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలని ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, అరుణ, అనూరాధ, సుజాత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరులో

బోడవాడ(పర్చూరు) : గర్భిణులు, బాలింతలు తప్పక పోషకాహారం తీసుకోవాలని తద్వారా పుట్టబోయే బిడ్డతోపాటు తల్లి కూడా ఆర్యోంగా ఉంటుదని సీడీపీవో సుభద్ర అన్నారు. బుధవారం పర్చూరు మండలంలోని బోడవాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవోమాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కారంచేడులో

కారంచేడు గ్రామంలో బుధవారం గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ పైజర్‌లు, హిమబిందు, సుమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలి


విత్తనశుద్ధి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ, సెప్టెంబరు 11 : రైతులంతా సేంద్రియ పద్ధతి ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఈమని నాగరాజు అనే రైతు రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా సేంద్రియ పద్ధతిలో వరి సాగును ఏవో పరిశీలించారు. బీజామృతం ద్వారా చేపడుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని ఏవో చూసి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కూడా సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని రైతులు పంటల సాగుకు గ్రామాలలో అందుబాటులో ఉండే వస్తువుల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాస్, రైతులు వీరబాబు పాల్గొన్నారు.

రాతి మండపానికి విరాళం

అద్దంకి, సెప్టెంబరు 11 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలచనకోటకు చెందిన బత్తిని ప్రసాద్, నిర్మల దంపతులు 2,25,116 రూపాయలను బుధవారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు. బత్తిని వెంకటప్పయ్య, బుల్లెమ్మ జ్ఞాపకార్థం కుమారుడు ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి విరాళాన్ని అందజేశారు.


ఈవో నుంచి రసీదును అందుకుంటున్న దాతలు

వైసీపీ పాలకుల పాపాలు.. నేడు శాపాలు

టీడీపీ కూటమి నాయకుల ఆవేదన

చీరాల, సెప్టెంబరు 11 : గత వైసీపీ పాలకులు చేసిన పాపాలు, నేడు శాపాలుగా మారాయని పలువురు కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్‌రెడ్డి హయాంలో ఈపురుపాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలతో కరకట్టలు కరిగిపోయాయన్నారు. ఆ పాపం నేడు అనుభవించాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఎన్నికలకు ముందు చీరాల వచ్చినప్పటి నుంచి నేటి వరకు పారదర్శకమైన అడుగులు వేస్తున్నారన్నారు. విజయవాడ వరదల నేపథ్యంలో జక్కంపూడిలో వరదబాధితుల సహాయార్థం ఎమ్మెల్యే కొండయ్య, ఇతర నాయకులు తమ సేవలు అందిస్తుంటే, ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో అధికారుల బదిలీల విషయంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాస్తవాలు ఉంటే నిగ్గు తేల్చాలన్నారు. అలా నిరూపిస్తే తాను రాజకీయాలను శాశ్వతంగా వదిలేస్తానని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్ అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న పనులను సానుకూల దృక్పథంతో చూడాలని నాయకులు కోరారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగక పోవడం వలన అభివృద్ధి కుంటుపడిందని పలువురు నాయకులు చెప్పారు. తీరప్రాంత గ్రామమైన వాడరేవు పంచాయతీ అభివృద్ధి, తీరప్రాంత పరిరక్షణకు కీర్తివారిపాలెం వద్ద టోల్‌గేట్ ఏర్పాటుకు ఎమ్మెల్యేను తాము కోరామన్నారు. అదే విధంగా వేటపాలెం మండలం రామాపురంలో కూడా టోల్‌గేట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాల ద్వారా రుసుము రూపేణా వచ్చిన మొత్తాన్ని పారదర్శకంగా గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తారని చెప్పారు. అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి మంచి సలహాలు ఇవ్వాలే కాని నిరాధార ఆరోపణలు సరి కాదన్నారు. డీపీవో మంజూరు చేసిన అనుమతిపత్రం నకళ్లను అందజేశారు. అనుమతి పత్రంలో కీర్తివారిపాలెం వద్ద పార్కింగ్ కోసమని, అందుకు సంబంధించి వచ్చిన రుసుము గ్రామ పంచాయతీ నిధులకు జమ చేయాలని అందులో ఉంది. అయితే కీర్తివారిపాలెంకు వాడరేవు సముద్ర తీరానికి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉంటుంది. అంటే వాహనాలు కీర్తివారిపాలెం వద్ద పార్కింగ్ చేసి వెళ్లాలా లేకుంటే, తీరంలో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడ వాహనాలు పార్కింగ్, వాటికి భద్రత కల్పిస్తారా అనే విషయాలపై స్పష్టత లేదు. ఈ క్రమంలో సూర్యలంక వద్ద ఉన్న టోల్‌గేట్ అంశాన్ని ప్రస్తావించారు. సమావేశంలో కూటమి నాయకులు కౌతవరపు జనార్దనరావు, గంజి పురుషోత్తమ్, గుద్దంటి చంద్రమౌళి, గజవల్లి శ్రీనివాసరావు, గూడూరి శివరామప్రసాద్, జంగిలి రాముడు, బందు గురవయ్య, పిక్కి నారాయణ, ఉల్లిపాయల సుబ్బయ్య, సత్యానందం, కూటమి నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

టోల్ గేట్ రుసుము పంచాయతీకి జమ

జీతభత్యాలు, అభివృద్ధి పనులకు వినియోగం

చీరాల, సెప్టెంబరు 11 : టోల్‌ప్లాజాలో వసూలైన నిధులను పంచాయతీ నిధులకు బుధవారం జమచేశారు. మండల పరిధిలోని వాడరేవు పంచాయతీ తీరప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, గ్రామాభివృద్ధి పనులు, సిబ్బంది జీతభత్యాలకు నిధుల సమీకరణకు సంబంధించి కీర్తివారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద తొలి మూడు రోజులకుగాను రూ.17,300 వసూలయ్యాయి. ఆ నిధులు పంచాయతీకి జమ చేశారు. బుధవారం రూ.7,800 టోల్‌గేట్ ద్వారా వసూలయ్యాయి. ఆ నిధులను ముందుగా సిబ్బంది జీతభత్యాలకు, పారిశుధ్య పనులకు వినియోగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి మూడు రోజులకోసారి వసూలైన రుసుమును, పంచాయతీ నిధులకు జమ చేస్తూ పారదర్శకంగా నిధుల వినియోగం జరిగేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుగు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

ఇంకొల్లు, సెప్టెంబరు 11 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయిని స్వర్ణ ప్రభావతి అన్నారు. ఇంకొల్లుకు చెందిన ప్రవాసాంధ్రుడు కరి సుబ్బారావు రాంనగర్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం రూ.50వేల విలువైన బల్లలను అందజేసారు. ఈ సందర్భంగా దాత సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఆకాంక్షతో తమ వంతు సహాయసహకారాన్ని అందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావును ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ లతీఫ్, ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, శివరామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : బాలల వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా ప్రతినిధి స్వప్నప్రియ అన్నారు. బుధవారం చీరాల నీలం జేమ్స్ ఎయిడెడ్ స్కూల్, వేటపాలెం బాలకోన్నత ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విద్యా హక్కులు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యా ప్రామాణిక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలతోనే లక్ష్య సాధన

ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వలన లక్ష్యాలపై దృష్టి పెరుగుతుందని ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండల స్థాయి వికసిత్ ఏపీ-2047 భాగంగా 6-10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్‌లో జరిగాయి. మొదటి బహుమతిని కేజీబీవీ చీరాల విద్యార్థి ఉన్నగిరి వెంకట అనిత, రెండవ బహుమతిని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ విద్యార్థి శివరామ్, మూడవ బహుమతిని కేజీఎంజీ విద్యార్థి యశ్విత సాయిలక్ష్మి, ఉపన్యాస పోటీల్లో మొదటి బహుమతిని కేజీబీవీ చీరాల విద్యార్థి రేవు హేమ, రెండవ బహుమతిని కేజీఎంజీ విద్యార్థి గీతాలక్ష్మి, మూడో బహుమతిని బీవీఅండ్‌బీఎన్ జాండ్రపేట విద్యార్థి రిషిక సాధించారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 11 : భక్తులు సముద్ర తీరాల్లో నిమజ్జన సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని రూరల్ సీఐ సత్యనారాయణ సూచించారు. సముద్రతీరంలో నిమజ్జనాలు పోటెత్తడంతో రాత్రి సమయంలో కూడా సీఐ గస్తీ విధులు నిర్వహించారు. ఎప్పటికప్పుడు భక్తులకు జాగ్రత్తలు చెప్తూ అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. సముద్రతీరంలో ప్రమాదాలు జరగకుండా అన్ని విధాలుగా సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. సీఐ వెంట రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రాత్రి సమయంలో తీరం వద్ద సీఐ సత్యనారాయణ


ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సేవింగ్ స్కీములపై అవగాహన ర్యాలీ

మార్టూరు, సెప్టెంబరు 11 : పోస్టాఫీస్ సేవింగ్ స్కీములపై ప్రజలకు అవ గాహన కలిగించేందుకు పోస్టల్ ఉద్యోగులు బుధవారం మార్టూరులో ర్యాలీ నిర్వహించారు. మార్టూరు పరిధిలో ఉన్న 18 గ్రామాల బ్రాంచి పోస్ట్ మాస్టర్లు, ఉప బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు డాక్‌చోప్‌లో భాగంగా సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీరాల ఏఎస్పీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మార్టూరు బ్రాంచి పోస్ట్ మాస్టర్ జి.అక్కయ్య ఆధ్వర్యంలో బ్రాంచి ఆఫీసు నుంచి ర్యాలీగా వెళ్తూ సేవింగ్స్ స్కీములపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో జీ నితిన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోస్టాఫీస్‌లో పథకాలు, సేవలపై ఏఎస్పీ వివరించారు. ప్రజలు పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.


రోడ్డు మధ్యలో నిలిచిన పోయిన లారీ

గోతులలో నిలిచిన గ్రానైట్ లారీ

నిలిచిన ట్రాఫిక్

బల్లికురవ, సెప్టెంబరు 11 : మండల పరిధిలోని బల్లికురవ మార్టూరు అర్అండ్‌బీ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గోతులతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం వీర్లకొండ గ్రానైట్ క్వారీ నుంచి మార్టూరు వెళుతున్న రాయి లారీ గోతుల వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా మర్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో సుమారు రెండు గంటల పైబడి ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ప్రతి రోజు గోతుల రోడ్డులో ఇలాంటి పరిస్థితి ఉంటుందని తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, గోతులలో గ్రానైట్ పలకలు వేయడం వలన వాహనాలు చెడిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

ఐదోరోజు వైభవంగా వినాయక ఉత్సవాలు

పంగులూరు, సెప్టెంబరు 11 : ఐదోరోజు వినాయచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలపాల వద్ద పెద్దఎత్తున పూజలు, ప్రసాద వితరణ, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం తెలుగు యువత నాయకులు సతీష్ దంపతులు పూజలు నిర్వహించారు.

రూ.లక్ష నాణాలతో

లంబోదరుడికి అలంకరణ

అద్దంకి, సెప్టెంబరు 11 : అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్ బ్రాహ్మణ బజార్ లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం కు బుధవారం నాణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్షా పదహారు రూపాయల విలువైన ఒక రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల నాణెములు తో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వి గ్రహాలను బుధవారం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తూ, ప్రసాదాలు పంపిణీ చేశారు.


పూజలు అందుకుంటున్న గణపయ్య


ఇందిరానగర్ బ్రాహ్మణ బజార్‌లో విగ్రహానికి లక్ష నాణాలతో అలంకరణ

నేడు మంత్రి పర్యటన

అద్దంకి, సెప్టెంబరు 11 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అద్దంకి నియోజకవర్గంలో పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9-30 గంటలకు అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కొత్త బస్సులను రవికుమార్ ప్రారంభించనున్నారు. 11 గంటలకు పంగులూరు మండలం చందలూరులో జరిగే కార్యక్రమానికి మంత్రి హాజరుకానున్నారు.

ఆంధ్రజ్యోతి

5



ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 12 సెప్టెంబరు 2024



అబ్బో.. ఎంత పెద్ద నౌక!

అదాని కృష్ణపట్నం పోర్టులో బుధవారం భారీ నౌక (కేఫ్ వేజల్) లంగరు వేసింది. పోర్టులోని మూడో నెంబరు బెర్త్‌కు మొదటిసారి ఎంవీ యాన్ లీ అనే పెద్ద నౌక చేరుకుంది. 288.88 మీటర్ల పొడవు, 17.48 మీటర్లు డెప్త్ కలిగిన ఈ నౌక సౌతాఫ్రికా నుంచి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుతో కృష్ణపట్నం పోర్టుకు చేరుకుంది. పోర్టులో మెరైన్ టీమ్ విజయవంతంగా కేఫ్ వేజల్ లంగర్ వేసుకునేందుకు కృషి చేశారు. కేఫ్ వేజర్ రాకతో అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు, జగదీష్ పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీవోవో రాజన్‌బాబు, కెప్టెన్‌లు రజిత్‌గార్గ్, సాహు, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, ''జేష్‌శర్మ, ఎస్‌కె.జునీద్, ఎండి.సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- ముత్తుకూరు

'సోమశిల'లో 48.234 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, సెప్టెంబరు 11: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవా రం 15.879 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 48.234 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

వినియోగంలోకి వస్తున్నాయ్..

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 : వైసీపీ సర్కారు హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన చెత్త సంపద కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు అందగా, వెంటనే రంగంలోకి దిగిన అధికారులు కేంద్రాల స్థితిగతులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో చెత్త, పేడదిబ్బలు, మురికి నిల్వలు లేకుండా చేసేందుకు చెత్తతో



వచ్చే నెల 2 నుంచి చెత్త సంపద కేంద్రాల పునఃప్రారంభం

సంపద సృష్టించాలన్న గొప్ప లక్ష్యంతో 2014-2019లో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 722 గ్రామ పంచాయతీలలో 517 కేంద్రాలను అప్పట్లో నిర్మించారు. అయితే వీటిలో 486 కేంద్రాలు పూర్తవగా, కొన్నింటి పనులు జరుగుతున్నాయి.

● వైసీపీ హయాంలో నిర్వీర్యం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ కేంద్రాలు మరుగునపడ్డాయి. ఐదేళ్లు గ్రామ పంచాయతీలను గాలికి వదిలేసినట్టుగానే ఈ కేంద్రాలను పూర్తిగా నిరుపయోగం గా మార్చేశారు. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత కొరవడింది. మురికిగుంతలు, వీధుల్లోనే చెత్త నిల్వలు, ఇళ్ల పక్కనే పేడదిబ్బలు ఉండటంతో పల్లెసీమలు మురికికూపంగా కొనసాగా యి. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో చెత్తసంపద కేంద్రాలకు మళ్లీ కదలిక ఏర్పడింది. గ్రామాల్లో ఉన్న చెత్త ను, పేరుకుపోయిన పేడదిబ్బలను ఎప్పటికప్పుడు తరలిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్త సంపద కేంద్రాల ద్వారా వర్మీకంపోస్టు ఎరువులు తయారుచేసి, రైతులకు అమ్మడం ద్వారా సంపద సృష్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ఉన్న చెత్త సంపద కేంద్రాల ను అక్టోబరు 2నుంచి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా రు. కేంద్రాలను శుభ్రం చేయడంతోపాటు అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు. తొలి గా 486 కేంద్రాలను, ఆ తర్వాత మిగిలిన 31 కేంద్రాలను వినియోగంలోకి తేనున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు 'సహకారం'

నెల్లూరు (హరనాథపురం) : రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి నిల్వ చేసుకోవడానికి వీలుగా మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను రిజిస్టర్ చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి బి.గురప్ప చెప్పారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో ఉలవపాడు మండల వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ, ఎన్నికలు, ఏపీ మాక్స్ చట్టం 1995 తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందచేశారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

జీవో నెం.85ను రద్దు చేయాల్సిందే!

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 : నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద బుధవారం వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.85ను రద్దు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లా డుతూ జీవోను రద్దు చేసి గతంలో లాగానే పీజీ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే టైమ్ బౌండ్ ప్రమోషన్లలో 6 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర అలవెన్స్‌లు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీ ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసనలో అసోసియేషన్ నేతలు రవీం ద్రనాథ్‌రెడ్డి, ధర్మేంద్ర, అహ్మద్‌బాబు, బాలచంద్రబాబు, శాంతి, రమాకుమారి, భానుప్రి య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో విధి నిర్వహణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : అడవుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో అందరూ విధులు నిర్వహించాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని అమరవీరుల స్థూపానికి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో శ్రీనివాసులరెడ్డి, రేంజర్ మాల్యాద్రి, ఉద్యోగ సంఘం నాయకులు పిచ్చిరెడ్డి, రవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



క్రేన్ సహాయంతో ప్రతిమలను నిమజ్జనం చేస్తూ..



నెల్లూరు : గణేష్ ఘాట్ వద్ద గంగా హారతులు ఇస్తున్న వేదపండితులు



బైబై గణేశా!

ఉత్సాహంగా విఘ్నేశ్వరుడి ప్రతిమల నిమజ్జనం

నెల్లూరులో వైభవంగా శోభాయాత్ర

గణేశ్ ఘాట్‌లో కనులపండువగా గంగా హారతులు



తాత్కాలిక గణపతి ఊరేగింపులో శంఖం పూరిస్తూ పాల్గొన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, బీజేపీ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) : 'చవితి' ఉత్సవాల్లో ఐదవ రోజు విఘ్నేశ్వరుల ప్రతిమల నిమజ్జనం ఉత్సాహంగా జరిగింది. స్వామివారికి విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణ, మంగళవాయిద్యాలు, తప్పెట్లు, తీన్‌మార్, డీజే సంగీతాలతో 'జై బోలో గణేష్ మహరాజ్' అంటూ యువకుల నినాదాలతో ఊరేగింపు జరిగింది. నెల్లూరులోని తిక్కనపార్కు ఘాట్, మూలాపేట ఇరుకళల పరమేశ్వరి స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌ల వద్ద తెల్లవారుజాము వరకు దాదాపు 350కిపైగా చిన్నా పెద్దా ప్రతిమల నిమజ్జనాలు జరిగాయి. కార్పొరేషన్, పోలీస్, అగ్నిమాపక దళం, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ ఆలయాల నుంచి తెచ్చిన ప్రసాదాలను భక్తులకు అందజేశారు. క్రాంతినగర్ శివకేశవుల దేవస్థానం, మాగుంట లే అవుట్‌లో ఏర్పాటు చేసిన లంబోదర సెట్టింగ్ నుంచి ఉత్సవ గణపతి నిమజ్జనం భారీ స్థాయిలో జరిగింది. శివాజీనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక గణపతికి నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్ పాల్గొని పూజలు చేశారు.

● కిక్కిరిసిన గణేశ్ ఘాట్

నగరంలోని నెక్లెస్‌రోడ్డు, ఇరుకళల పరమేశ్వరి ఆలయం గణేష్ ఘాట్‌లో బుధవారం రాత్రి గణేష్ నిమజ్జనం, శోభాయాత్ర, గంగా హారతుల వేడుకలు అంబరాన్ని అంటాయి. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఘాట్‌లో కేరళ వాయిద్య కళాకారులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల కోలాటం, విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణపతికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలతో పల్లకిపై శోభాయాత్ర జరిగింది. ఈ యాత్రలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేస్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వర రావు, కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్, మాజీ మేయర్లు అనురాధ, భానుశ్రీ, కార్పొరేటర్లు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శంఖం పూరించగా గణేష్ ఘాట్‌లో సామూహిక గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● కనుల పండువగా హారతులు

వారణాసి, హరిద్వార్‌లలో జరిగే విధంగా గణేష్ ఘాట్‌లోనూ గంగాహారతులు కనుల పండువగా జరిగాయి. వేద పండితుడు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో గణపతి పూజ, కలిశ ప్రతిష్ఠ పూజ, గంగా పూజలు చేశారు. భక్తుల జయ జయ నినాదాల నడుమ వేదపండితులు గంగాదేవికి (స్వర్ణాల చెరువు)కు ప్రణవానమామి, ధూపం, దీపం, నక్షత్ర హారతులు, నాగ హారతులు, వస్త్ర సమర్పణలు చేశారు. అనంతరం గంగా, యమున, భద్ర, పెన్నా నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలను భక్తులపై సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా వేదికపై విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు, ఘాట్‌ల మరమ్మతులు, ఏర్పాట్లు దాదాపు రూ.2కోట్లకుపైగా విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

● భద్రతా ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (క్రైం) : ఇరుకళల పరమేశ్వరి ఆలయ పరిసరాల్లో గణేష్ నిమజ్జన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

"దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. దీవించయ్యా దేవా..!' అంటూ ప్రజలు గణనాథుడికి ఐదు రోజులపాటు విశేష పూజలు చేశారు. తమ భక్తిని చాటుకుంటూ ఖర్చుకు వెనుకాడకుండా ఉత్సవ కమిటీలు ఉత్సవాలను నిర్వహించాయి. 'చవితి' రోజున గణనాథుడి ప్రతిమ ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు ఆర్భాటంగా పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వీధి వీధినా వినాయక మండపాలు ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు. అధికారికంగా అనుమతులు తీసుకున్న మండపాల కన్నా అనుమతులు లేనివి రెండు రెట్లు అధికంగా ఉంటాయని అధికారుల అంచనా. జిల్లాలో కొన్నిచోట్ల మూడో రోజు నిమజ్జనం చేయగా చాలా వరకూ ఐదో రోజు బుధవారం నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలో మొత్తంగా ఉత్సవాల ఖర్చు రూ.వంద కోట్లు దాటింది. గణేశుడి పుణ్యమా అని చాలా వర్గాలకు ఉపాధి దొరికింది. హైరర్స్ నుంచి బాణా సంచా వ్యాపారాల వరకూ పుష్కలంగా సాగగా, ఆ వర్గాలను నమ్ముకున్న కూలీలకు చేతినిండా పని దొరికింది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి



నెల్లూరు : మాగుంట లేఅవుట్‌లో తంజావూరు శిల్పకళను పోలిన మండపం

'చవితి' ఖర్చు రూ.100 కోట్లు

ఈ ఏడాది వైభవంగా వినాయక చవితి

వీధి వీధినా మండపాలు ఏర్పాటు చేసి పూజలు

ఒక్కో మండపం ఖర్చు సరాసరి రూ.లక్ష

అనుబంధ వ్యాపారాలకూ మంచి డిమాండ్



గతానికి భిన్నంగా ఈ ఏడాది వినాయక చతుర్థి ఉత్సవాలు జరిగాయి. ఐదు రోజులపాటు జరిగిన ఈ వేడుకలను గమనించిన ప్రజలకు ఈ విషయం ఈపాటికే అర్థమై ఉంటుంది. గతంలో ఒక ప్రాంతం లేదా ప్రధాన కూడలిలో గణనాథుడి ప్రతిమను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది మాత్రం వీధి వీధినా విగ్రహాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లోనూ ఒక బొమ్మ పెట్టే విధానం పోయి కొన్ని వీధులు కలిసి ఒక విగ్రహం ఏర్పాటు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజల్లో భక్తిభావం పెరిగిందనడానికి ఇది నిదర్శనమని ఆధ్యాత్మికవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది వినాయక మండపాలకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేసింది. జిల్లామొత్తంగా 3209 మండపాలకు అనుమతులు తీసుకున్నారు. అయితే, ఇవన్నీ పెద్ద స్థాయిలో వేడుకలు నిర్వహించిన మండపాలు. కానీ ఓ మోస్తరు, చిన్నస్థాయిలో ఉత్సవాలు నిర్వహించిన మండపాలు ఈ సంఖ్యకు రెండింతలు ఉంటాయని అంచనా. ఈ లెక్కన జిల్లా మొత్తం ఎప్పుడూ లేని విధంగా పది వేలకుపైగా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. నగరం, పట్టణాల్లో ప్రతి అపార్టుమెంట్‌లో ఉత్సవాలు జరిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లలోనూ వినాయక ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

● నిత్యం ప్రత్యేక అలంకరణలు

వినాయక మండపాల వద్ద ఉత్సవాలు జరిగినన్ని రోజులూ నిత్యం ప్రత్యేకంగా గణనాథుడిని అలంకరించారు. పూల అలంకరణ ఖర్చే ఇందులో ఎక్కువగా ఉంది. అందులోనూ నిమజ్జనం రోజున గణనాథుడితోపాటు వాహనాన్ని అలంకరించేందుకు భారీగా ఖర్చు చేశారు నిర్వాహకులు. దీంతో పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కొందరు ఉత్సవ కమిటీ నిర్వాహకులు బెంగళూరు నుంచి నిత్యం పూలను తెప్పిం చారు. మండపాల వద్ద వివిధ అలంకరణలో టెంట్లు వేయడంతో పాటు కుర్చీలు, టేబుళ్ల ఏర్పాటుతో హైరర్స్ వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా జరిగింది. చాలా చోట్ల విద్యుద్దీప అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొన్ని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి టీవీ, సినీ ఆర్టిస్టులను తీసుకొచ్చి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున నిమజ్జనం సందర్భంగా డీజేలు, బ్యాండ్‌మేళాల ఏర్పాటుతో భారీగా ఖర్చు చేశారు. ఇక బాణాసంచా విషయంలోనూ నిర్వాహకులు వెనకడుగు వేయలేదు. ఈ ప్రభావంతో బాణాసంచా ధరలు అమాం తం పెరిగిపోయాయి. చాలా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా భారీ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు చేయడంతో పూజారులకు కూడా చేతినిండా పనిపడింది. వారికి కూడా మంచి సంభావనలు లభించాయి.

● ఖర్చు ఇలా..

ఈ ఏడాది ఏ మండపం వద్దకు వెళ్లినా ప్రత్యేకత కనిపించింది. అందుకు మండపాలను ఖర్చుకు వెనుకాడకుండా అలంకరించడమే కారణం. విగ్రహాలు కూడా ఆకట్టుకున్నాయి. వివిధ దైవరూపాల్లో వినాయకుడు దర్శనమిచ్చాడు. విగ్రహాల ధర రూ.10 వేల నుంచి 2 లక్షల వరకూ ఉంది. చాలా వరకూ రూ.20 వేల నుంచి 80 వేల ధర మధ్యనున్న ప్రతిమలనే కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. సరాసరి ఒక్కో విగ్రహం విలువ రూ.30 వేల వరకూ ఉంది. ఆ లెక్కన చూసుకున్నా ఒక్క విగ్రహాల కొనుగోళ్లకే సుమారు రూ.30 కోట్లకుపైగా జిల్లాలో ఖర్చు చేశారు. ఇక మండపాల అలంకరణకు భారీగా ఖర్చయింది. హైరర్స్ నుంచి శోభాయాత్రకు ఉపయోగించిన వాహనాల వరకూ లెక్క చూసుకుంటే పెద్ద మొత్తంలోనే ఉంది. పట్టణ ప్రాంతాల్లో కొన్ని మండపాల ఖర్చు రూ.10 లక్షలు దాటింది. జిల్లా మొత్తంగా చిన్న, పెద్ద మండపాలను చూసుకుంటే ఒక్కో మండపం ఖర్చు సరాసరి రూ.లక్ష వరకూ ఉంది. ఆ లెక్కన పది వేల మండపాలకు 'చవితి' ఉత్సవాల ఖర్చు రూ.100 కోట్లు దాటి ఉంటుందని అంచనా. ఈ స్థాయిలో ఖర్చు గతంలో ఎప్పుడూ జరగలేదని ఉత్సవ కమిటీల నిర్వాహకులు చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఏర్పాటైన మండపాల వివరాలు

పోలీస్ సబ్ డివిజన్	అనుమతులు	లేనివి
నెల్లూరు నగరం	421	1,500
నెల్లూరు రూరల్	748	1,500
కావలి	1,112	1,000
ఆత్మకూరు	642	1,000
కందుకూరు	286	1,000
మొత్తం	3,209	7,000



నెల్లూరు నగరంలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపులో యువకుల ఉత్సాహం

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వేడుకగా గణపయ్యల నిమజ్జనం

వినాయక చవితి సందర్భంగా పలుచోట్ల శనివారం ప్రతిష్ఠించిన గణపతి ప్రతిమలను, విగ్రహాలను ఐదోరోజు బుధవారం నిమజ్జనాలకు తరలించారు. ఉత్సాహంగా గ్రామోత్సవాలు, ఊరేగింపుల అనంతరం స్వామివారిని జలధివాసం చేశారు. జిల్లాలో జరిగిన కార్యక్రమాల వివరాలు..



కావలి రూరల్ : తుమ్మలపెంట తీరానికి నిమజ్జనానికి తరలిన భారీ వినాయకుడు



అల్లూరు : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



లింగసముద్రం : ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

కావలి రూరల్ : మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ఐదోరోజు బుధవారం నిమజ్జనాలకు తరలించారు. తీరంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

కావలిటౌన్ : స్థానిక కలుగోళశాంభవి ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండప ప్రత్యేక సెట్టింగులను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. బ్రిడ్జి కూడలిలో భగత్‌సింగ్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బుధవారం పలు ప్రాంతాల్లోని విగ్రహాలు నిమజ్జనానికి తీరానికి తరలివెళ్లాయి. ఆటోనగర్‌లో గణపతికి గ్రామోత్సవం నిర్వహించారు.

గుడ్లూరు : ఐదు రోజులపాటు పూజలు అందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనానికి రామాయపట్నం సముద్రతీరానికి భక్తులు తరలించారు. గుడ్లూరు వడ్డెపాలెం, రజకపాలెం, బీసీ కాలనీ, సినిమాహాల్ సెంటర్‌లోని వినాయకులను రామాయపట్నంకు తరలించారు. మండలం నలుమూలల నుంచి బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటున్న వినాయకులతో రద్దీ నెలకొంది.

అల్లూరు : మండలంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. అల్లూరు కోనేరు సెంటరులోని గణనాథుడిని హిందూ. ముస్లింలు కలసికట్టుగా నిమజ్జనానికి తరలించారు. ముందుగా లడ్డూ వేలం నిర్వహించగా ముస్లింలు రూ.8.5 వేలకు కైవసం చేసుకున్నారు. కొన్నిచోట్ల ముగ్గుల పోటీలు, ఉట్టి మహోత్సవాలు చేపట్టారు.

కొండాపురం : ఐదోరోజు బుధవారం వినాయక ప్రతిమలను నిమజ్జనాలకు తరలించారు. చివరిరోజు అన్నదానం, యువతకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలో మొత్తం 17 గణనాథుల నిమజ్జనం జరిగినట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

లింగసముద్రం : మండలంలోని లింగసముద్రం, వెంగళాపురం, మొగిలిచెర్ల, చీమలపెంట తదితర గ్రామాల్లో ఐదోరోజు బుధవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు గణనాథుడి విగ్రహాలకు పూజలు చేసి, అనంతరం అన్నదానం చేశారు. తదుపరి విగ్రహాలను ట్రాక్టర్లపై గ్రామాల్లో ఊరేగించారు. రాళ్లపాడు ప్రాజెక్టు, మన్నేరులో నిమజ్జనం చేశారు.వెంగళాపురంలో నిర్వహించిన వేలంలో వెలుగు పెద కోటేశ్వరరావు రూ.50 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. మొగిలిచెర్లలో భారీ పోలీసు బందోబస్తు మధ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో గణనాథుల నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. విశ్వనాథరావుపేట, కొత్తూరు, కోవూరుపల్లి, కడనూతల, ముంగమూరు గ్రామాల్లో గణేషుడి విగ్రహాల ఊరేగింపు అనంతరం తాటిచెట్లపాలెం, పాతపాలెం సముద్రానికి తరలించి నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఎస్సై భోజ్య సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రతీరాన వెండి కాలి గొలుసులు దొరికాయని, ఎవరైనా పోగొట్టుకుని ఉంటే స్టేషన్‌కు వచ్చి తీసుకుపోవాలని ఎస్సై తెలిపారు.

కందుకూరు : వినాయక నిమజ్జనోత్సవాలను కందుకూరు పట్టణం, పరిసర గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని విగ్రహాలను ఐదవ రోజు నిమజ్జనం కోసం పాకల సముద్ర తీరానికి తరలించుకుని వెళ్లారు. సాయినగర్ 2వ లైనులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. మండలంలోని పలుకూరు యువతీయువకులు పోకూరి వీరాస్వామి ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ఉదయగిరి రూరల్ : గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదోరోజు నిమజ్జనానికి తరలించారు. బుధవారం గంగిరెడ్డిపల్లి, గండిపాళెం, ఉదయగిరి పట్టణంలోని వాల్మీకివీధి, యాదవపాళెం, బ్రాహ్మణవీధి, బాలాజీనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను వాహనాల్లో ప్రతిష్ఠించి పురవీధుల్లో మేళతాళాల నడుమ నిమజ్జనానికి తరలించారు. అలాగే దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ గిరిజన కాలనీలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ జిల్లా నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, స్వాతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కాలనీకి చెందిన నల్లుపాటి కొండయ్య స్వామివారి లడ్డూను వేలంలో రూ.20వేలకు దక్కించుకున్నారు. ఉట్టి మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు. అనంతరం సమీపంలోని నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



బిట్రగుంట : గణేశ్ నిమజ్జన అనంతరం సముద్ర స్నానమాచరిస్తున్న భక్తులు



కందుకూరు : సాయినగర్ 2వ లైనులో నిమజ్జనోత్సవానికి తరలిస్తున్న వినాయకుడు

సంగం: మండల కేంద్రంలోని రాళ్లచెలిక ఎస్టీ కాలనీ, వడ్డెపాళెం, సాయినగర్, కొత్తూరు తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ట్రాక్టర్లపై ఉంచి వేడుకగా పెన్నానదికి నిమజ్జనానికి తరలించారు.

అనంతసాగరం: కొత్తపల్లిలోని నాలుగు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను నిమజ్జనానికి తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్ చల్లాచంద్రశేఖర్‌రెడ్డి ఆలయంలోని స్వామికి గజమాల పూజలు చేశారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ, తప్పెట్ల వాయిద్యాల మధ్య పెన్నానదికి తరలించారు.

సీతారామపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. స్థానిక స్వామి చెరువులో విగ్రహాలను పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ వెంకటరమణ, సీఐ వెంకట్రావ్ బందోబస్తు నిర్వహించారు.



సంగం: గణేశుడి గ్రామోత్సవం



సీతారామపురంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



ఉదయగిరి రూరల్ : గంగిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

ప్రజలకు స్వచ్ఛమైన నీరివ్వాలి

● నీటి పథకాల పరిశీలనలో అధికారులు



గుడ్లూరు మంచినీటి పథకం వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ హుస్సేన్

లింగసముద్రం, సెప్టెంబరు 11: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేస్తున్న మూడు భారీ నీటి పథకాల నుంచి ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలని నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ ఎండీ సత్తార్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆంధ్రజ్యోతిలో 'తాగునీటి పథకాల నిర్వహణ అధ్వానం' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో ఈఈ హుస్సేన్, కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె రామ్మోహన్‌రావు, ఏఈ సీహెచ్ రాజశేఖర్‌లు బుధవారం గుడ్లూరు, రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకాలతో పాటు రాళ్లపాడు ప్రాజెక్టులోని ఇన్‌టెక్‌వెల్‌ను పరిశీలించారు. మంచినీటి పథకాల వద్ద విద్యుత్ రీడింగ్‌ను పరిశీలించారు. నీటి పంపింగ్ ఎన్ని గంటలు జరుగుతుంది ? సిబ్బంది ఎంతమంది ఉన్నారు ? అని డీఈని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోని నీటిని వారు పరిశీలించారు.నీరు పచ్చగా ఉండడాన్ని గమనించారు. ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు.ప్రాజెక్టులో నీరు అడుగంటి ఉండడం, చేపలు పడుతున్నందున నీరు కలుషితమై వస్తున్నాయన్నారు. దీంతో ఆయన చేపలు పట్టే వారిని పిలిపించి, ఇన్‌టెక్ వెల్ సమీపంలో చేపలు పట్టవద్దని, దూరంగా పట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫిషరీస్ ఏడీతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ జనిగర్ల నాగరాజు, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణానికి సహకరించండి



మంత్రి ఆనంతో చర్చిస్తున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 11: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రామాలయాల నిర్మాణానికి సహకారం అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో ఆయన మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాల నిర్మాణం కోసం తమవంతుగా కొంత మొత్తాన్ని భరించేందుకు గ్రామస్థులు సిద్ధంగా ఉన్నారని, మిగిలిన మొత్తాన్ని టీటీడీ నుంచి చెల్లించాలని కోరారు.ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వర్గీకరణను వెంటనే నిలిపివేయాలి

అల్లూరు, సెప్టెంబరు 11 : ఎస్సీల వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని అల్లూరులో దళితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ముందుగా పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీల వర్గీకరణను వెంటనే నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణను నిలిపివేసి మాల మాదిగలను అన్యోన్యంగా మెలిగేలా చేయాలన్నారు. కార్యక్రమంలో దానం మాల్యాద్రి, ఉపినెర్తి కమలాకర్, కలిచేటి వెంకటేశు, గంగపట్నం జీవన్‌పాల్, గోళ్ల రాము, చెంతాటి ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైద్య సేవలు

కావలి, సెప్టెంబరు11: విజయవాడలోని వరద బాధితులకు కావలి రెడ్‌క్రాస్ మెడికల్ రిలీఫ్ టీం బుధవారం వైద్యసేవలు అందించారు. లోతట్టు ప్రాంతాలైన సితారనగర్, కండ్రిక, సింగ్‌నగర్‌లలో వైద్యశిబిరాలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు వైద్యశిబిరాలను సందర్శించి వారిని అభినందించారు. మచిలీపట్నంకు చెందిన రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు రమేష్‌బాబు కావలి సభ్యులను పరిచయం చేసుకున్నారు. రెడ్‌క్రాస్ మెడికల్ రిలీఫ్ టీంలో బీద లక్ష్మీనంద, నచికేత్, ఫయాజ్, మధు, వెంకటేశ్వర్ల తదితరులు ఉన్నారు.

చోరీ కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 11 : ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు.ఈ సంఘటన ఉలవపాడులోని కొత్తూరు శివారు ప్రాంతంలో జరిగింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు, షేక్ చౌదరి బాబు రిటైర్డ్ షిప్‌యార్డు ఉద్యోగి. గత నెల 20న పనిమీద కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరుకి వెళ్లాడు. ఈనెల11న తిరిగి ఉలవపాడుకు వచ్చారు. ఇంటి తలుపులు పగలకొట్టి, బీరువా తెరిచి ఉందని పోలీసులకు పిర్యాదు చేశారు. మూడు సవర్ల బంగారం, రూ.20 వేలు నగదు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 11 : మండలంలోని మన్నేరు వాగు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున ఎస్సై షేక్ మహబూబ్ సుభాని, సిబ్బంది గ్రామ శివారులో ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుభాని చెప్పారు.

బాధితురాలికి ప్రభుత్వ సాయం : సీడీపీవో

ఉలవపాడు, సెప్టెంబరు 11: ఇటీవల లైంగికదాడికి గురైన బాలిక (9)కు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ తెలిపారు. బుధవారం బాధితురాలి స్వగ్రామమైన మన్నేటికోట శంకర్ నగర్‌లో ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులు కుటుంబ సభ్యులను కలిసి బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రుల అనుమతి మేరకు బాలికను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్చి చదివిస్తామని చెప్పారు.

పారిశుధ్య కార్మికులను వెనక్కు రప్పించాలి

కావలిటౌన్, సెప్టెంబరు11: విజయవాడలో పారిశుధ్య పనుల నిమిత్తం పంపిన మున్సిపల్ కార్మికులను తిరిగి కావలికి రప్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సీఐటీయూ గౌరవా ధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ విజయవాడలో పారిశుధ్య పనుల నిమిత్తం కావలి నుంచి 90మంది కార్మికులను తీసుకెళ్లారని, పదిరోజులైనా వారిని తిరిగి పంపకపోవడం దారుణమన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు మధు సూదన్‌రావు, తురక శీనయ్య, శెట్టిపల్లి మాల కొండయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయండి

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 11: బీజేపీ సభ్యత్వ సమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ అన్నారు. దగదర్తి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు బీ.ప్రసా దరావు ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు జరిగింది. ఈ కార్యక్రమంలో భరత్ మాట్లాడారు. కావలి పటణ అధ్యక్షుడు కే బ్రహ్మానం దం, బోగోలు మండల అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసులు యాదవ్, పార్టీ నేత మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామసభను అడ్డుకోలేదు'

కొండాపురం, సెప్టెంబరు11: ఉపాధి హామీ గ్రామసభను తాను అడ్డుకోలేదని, తనిఖీ సక్రమంగా జరగలేదని అధికారులను ప్రశ్నించానని సాయిపేట గ్రామ టీడీపీ నాయకుడు వల్లూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం టీడీపీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను నిర్మించుకున్న గోకులం షెడ్డును తనిఖీ చేయమని సిబ్బందిని కోరగా, ఎందుకు రాలేదని ప్రశ్నించానే తప్ప అవినీతిని బయటకు రానివ్వకుండా తాను ఎవరినీ వెనుకేసుకొని రాలేదన్నారు. కార్యక్రమంలో ఇర్ల అంకబాబు, గంటా శ్రీనివాసులు, చెన్నపనాయుడు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

మర్రిపాడు, సెప్టెంబరు 11: విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆత్మకూరు ఫారెస్టు డివిజన్ రేంజ్ అధికారి శేఖర్ తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం 21జాతుల మొక్కలను నాటారు. పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, ఎంఈవో ధనలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 11: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఉపాధి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేస్త్రీలను ఆదేశించారు. బుధవారం ఆయన నారంపేటలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం లభిస్తుందన్నారు. ప్రతిరోజూ రూ.300 పొందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ వినోద్, ఎఫ్ఏ రామయ్య ఉన్నారు.

తన పొలంలో దారి కావాలంటున్నాడు !

● తహసీల్దారుకు బాధిత రైతు ఫిర్యాదు



తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు కృష్ణ

సంగం, సెప్టెంబరు 11: తాను సాగు చేసుకుంటున్న పొలాల్లో దారి కావాలని తన గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే రైతు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సంగంకు చెందిన కృష్ణ అనే రైతు బుధవారం తహసీల్దారు సోమ్లానాయక్‌కు ఫిర్యాదు చేశాడు. తరుణవాయిలో తనకు, అలాగే సూర్యనారాయణకు పొలాలు ఉన్నాయని, మా ఇద్దరి పొలాల మధ్య స్కీమ్ కాలువ ఉందన్నారు. సూర్యనారాయణ పొలానికి వేరే దారి ఉన్నా మా పొలంలో నుంచి దారి కావాలని కక్ష సాధింపుతో ప్రతి సోమవారం నెల్లూరులో జరిగే స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని ఆయన వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సురేష్, మస్తానయ్య అనే రైతులు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో పక్కాగృహాల పరిశీలన



పక్కాగృహాల కొలతలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 11: గంగిరెడ్డిపల్లి, వెంగళరావునగర్, గండిపాళెం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లోని పక్కాగృహాలను బుధవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. బేస్‌మెంట్, రూఫ్, పూర్తయిన ఇళ్లను పరిశీలించి కొలతలు సేకరించి, నాణ్యత ప్రమాణాలు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం సిమెంట్, స్టీల్ గోదాంలను తనిఖీ చేసి స్టాకు పరిశీలించారు. అలాగే దుత్తలూరు మండలంలోని నర్రవాడ, దుత్తలూరు గ్రామాల్లో నిర్మించిన పక్కాగృహాలను సైతం పరిశీలించి వివరాలు సేకరించారు. నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈ వెంకటరెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ ఈవీ ప్రసాద్, ఏఈలు రామకృష్ణ, యర్రప్రాయం, వర్కుఇన్‌స్పెక్టర్లు హర్ష వర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు, పోలయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారని విజిలెన్స్ అధికారుల బృందం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా విజిలెన్స్ ఏఈఈ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు బేస్‌మట్టం వరకు జరిగిన పనులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, ఏఈ రామకృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుధీర్ బాబు, నాగబాలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో విచారణ

కలువాయి, సెప్టెంబరు 11 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన హిందీ టీచర్ రామకృష్ణ సక్రమంగా విధులకు హాజరుకాలేదన్న ఆరోపణలపై బుధవారం కావలి ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య విచారణ చేపట్టారు. హెచ్‌ఎం అబ్బాస్ అలీతో పాటు గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన ఎస్.జనార్దన్‌రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు.

అటవీ భూమిని స్వాధీనం చేసుకోండి

కందుకూరు: గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం పేరుతో ఆక్రమించిన చెరువు పోరంబోకు, అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేసినట్లు హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. సర్వే నెం 879లో చెరువు పోరంబోకు భూమిని, సర్వే నెం883లో అటవీ భూమిని రామ ఆక్రమించాడని పేర్కొన్నారు.

డిప్లమో కోర్సులో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్

అనంతసాగరం: పదో తరగతి ఉత్తీర్ణులైన వారు 2024-25లో ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లమో కోర్సులో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజ రు కావాలని సోమశిల వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పుల్లంరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటలకు గుంటూరు కృష్ణా ఆడిటోరియంలో జరుగుతుందన్నారు.

రేపు మహాజన సభ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 11: కమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో శుక్రవారం ప్రత్యేక మహాజనసభ సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో సీహెచ్ లోక్‌నాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో సంఘం లావాదేవీలు, జమ, ఖర్చులు పరిశీలించి ఆమోదిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వరికుంటపాడు, సెప్టెంబరు 11: మండలంలోని జడదేవి, తూర్పుచెన్నంపల్లి, తూర్పుబోయమడగల, కనియంపాడు గ్రామాల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని త్రీఫేజ్ సౌకర్యం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఏర్పడుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 11: స్థానిక కరీమావీధిలోని ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని కంప్యూటర్లు, గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. రాపూరు, నెల్లూరు, ఉదయగిరి పట్టణాల్లో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రంథాయాల్లో ఈ ఏడాది నుంచి ప్రభుత్వం మైనార్టీ యువతకు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఆయా కేంద్రాల్లోని కంప్యూటర్లు, పుస్తకాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పనిచేయని కంప్యూటర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.

రేపు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం. సెప్టెంబరు 11: మండలంలోని మాలకొండ ఆలయంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం హుండీల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 శనివారాలకు 37 హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.